నూతన చట్టాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న హైకోర్టు న్యాయవాది సీవీఎల్ఎన్ మూర్తి

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తిలో ఎలక్ట్రానిక్ ఆధారాలకు ప్రాధాన్యం పెరుగుతోందని హైకోర్టు సీనియర్ న్యాయవాది సీవీఎల్ఎన్ మూర్తి అన్నారు. ఐలు ఆధ్వర్యంలో కొత్తగూడెం న్యాయవాదుల సంఘం గ్రంథాలయ సమావేశ మందిరంలో కొత్త చట్టాలపై అవగాహన సదస్సును జిల్లా జడ్జి పాటిల్ వసంత్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త సీవీఎల్ఎన్ మూర్తి మాట్లాడుతూ కృత్రిమ మేధ (ఏఐ)తో సాంకేతికంగా మెరుగైన అభివృద్ధి సాధించవచ్చునని అభిప్రాయపడ్డారు. ఇదే సమయంలో సైబర్ నేరాలు మరింత పెరిగే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక మాధ్యమాల ద్వారా వచ్చే నకిలీ సందేశాలను ఇతరులకు పంపించినా జరిమానాలతో పాటు శిక్షలు అమలయ్యే విధంగా నూతన చట్టాలు ఉన్నాయని స్పష్టం చేశారు. ఇలాంటి అంశాలపై న్యాయవాదులు పట్టు సాధించాలని సూచించారు. మహిళల చట్టాల గురించి ఖమ్మం న్యాయవాది వి.ఆశయ వివరించారు. న్యాయవాదుల సమస్యలపై రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు కె.సత్యనారాయణ ప్రసంగించారు. సదస్సులో న్యాయమూర్తులు జి.భానుమతి, బి.రామారావు, ఎ.సుచరిత, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ, ఐలు బాధ్యులు రమేశ్‌కుమార్ మక్కడ్, జె.శివరాంప్రసాద్ పాల్గొన్నారు.


హాజరైన జిల్లా జడ్జి పాటిల్ వసంత్, ఇతర న్యాయమూర్తులు

గని.. కోరుకున్న పని..!

ఆదివారం ప్రత్యేకం

సుమారు ఏడెనిమిదేళ్ల క్రితం సింగరేణి గనుల్లోకి మహిళలను అనుమతించేవారు కాదు. తదనంతరం పురుషులతో పాటు అతివలకు సమాన హక్కును యాజమాన్యం కల్పించింది. తద్వారా భూగర్భగనుల్లోకి సైతం మహిళలు ప్రవేశించే అవకాశం లభించింది. గనుల్లోకి మహిళలు వెళ్లినప్పుడు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాల్సి ఉంటుంది. అందువల్ల ప్రస్తుతం ఉద్యోగినులను సింగరేణి సంస్థ కార్యాలయాల్లో సర్దుబాటు చేస్తున్నారు. క్రమేణా మహిళా ఉద్యోగుల సంఖ్య పెరుగుతుండటంతో విద్యార్హత అధారంగా వారికి ప్రత్యామ్నాయ పనులను అప్పగించాలని యాజమాన్యం నిర్ణయించింది.

- కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే



సింగరేణిలో 600 మందికి పైగా మహిళా ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. వీరిలో ఇంజినీరింగ్ మొదలుకొని పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన వారూ ఉన్నారు. జనరల్ మజ్దూర్లుగా నియమితులైన వీరంతా ప్రస్తుతం అటెండర్లుగా విధులు నిర్వర్తిస్తున్నారు. కేవలం 'జనరల్ మజ్దూర్' పోస్టుల్లోనే అందరినీ సర్దుబాటు చేయటం సాధ్యపడటం లేదు. విద్యార్హత ఆధారంగా 16 రకాల విధులు అప్పగించాలని సింగరేణి యాజమాన్యం భావిస్తోంది. ఈమేరకు తాజాగా ఓ సర్క్యులర్‌ను విడుదల చేసింది. ఇప్పటికే వివిధ కార్యాలయాల్లో అవసరానికి మించి ఉన్న ఉద్యోగినులకు కౌన్సెలింగ్ ఇచ్చి వారి అభీష్టం మేరకు ఏదైనా ఒక పనిని ఎంచుకోవాలని సూచించనుంది. ఇష్టమున్న పనిని ఎంచుకొన్న తర్వాత వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి తదుపరి విధులు అప్పగించనుంది. ప్రస్తుతం భూగర్భగనుల్లో కాకుండా ఉపరితల ప్రాంతాల్లోనే విధులు నిర్వర్తించేలా ప్రణాళిక రూపొందించింది.


కొత్తగూడెం ఏరియాలోని మహిళా ఉద్యోగులు

మహిళా కార్మికులకు ఉద్యోగావకాశాలు

☆ కన్వేయర్ ఆపరేటర్ ☆ పంప్ ఆపరేటర్, వాల్వ్ ఆపరేటర్ ☆ ఛార్జర్ సేఫ్టీ ల్యాంప్, ల్యాంప్‌రూం ఫిట్టర్ ☆ కుక్ ☆ వెండార్ ☆ క్యాంటీన్ గర్ల్స్, కుక్ హెల్పర్ ☆ ఆఫీస్ అటెండెంట్ ☆ స్వీపర్ ☆ సర్వేమజ్దూర్ ☆ స్టోర్స్ ఇష్యూ మజ్దూర్ ☆ బైండర్ ☆ అసిస్టెంట్ మెషిన్ ఉమెన్ ☆ శాంప్లింగ్ మజ్దూర్ ☆ ఈపీగ్రీసర్, హెల్పర్ ☆ జనరల్ మజ్దూర్ ☆ ఎక్స్‌ప్లోజివ్ క్యారియర్

ప్రత్యేక కమిటీలతో కౌన్సెలింగ్

కార్పొరేట్, ఏరియా కార్యాలయాల్లో ఉద్యోగినులకు కౌన్సెలింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ఒక కమిటీని యాజమాన్యం నియమించనుంది. తొలుత ఆయా ఏరియాల్లో మహిళలకు ప్రకటించిన ఉద్యోగాల్లో ఖాళీలను గుర్తిస్తుంది. ఇష్టమైన పనిని ఎంచుకోవాల్సిందిగా ఉద్యోగినులకు కమిటీ సూచిస్తుంది. ఉద్యోగినులు కోరుకున్న విధులను కమిటీ ప్రతినెలా 20వ తేదీలోగా ఉన్నతస్థాయి యాజమాన్యానికి తెలియజేస్తుంది. ఏరియాల్లోని ఎస్వోటు జీఎంలు కమిటీకి నోడల్ అధికారులుగా వ్యవహరిస్తారు. కంపెనీ స్థాయిలో వివిధ ఏరియాల్లో ఉద్యోగినులు కోరుకొన్న పనులను క్రోడీకరించి విధులకు సంబంధించిన నైపుణ్యాలపై శిక్షణ ఇస్తారు. అనంతరం వారికి అవసరమైన ప్రాంతాల్లో విధులు కేటాయిస్తారు.

రాములోరికి ఘనంగా స్వర్ణ తులసీ దళార్చన

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి ఆలయంలో శనివారం భక్తుల సందడి నెలకొంది. బంగారు తులసి పూజలను ఘనంగా కొనసాగించారు. పసిడితో తయారు చేసిన తులసీ దళాలను సీతారాముడి పాదాల చెంత ఉంచి అర్చన జరిపారు. వైదిక పెద్దలు క్షేత్ర విశిష్టతను ప్రవచించిన తీరు మంత్రముగ్ధులను చేసింది. సీతమ్మకు యోక్త్రధారణ, రామయ్యకు యజ్ఞోపవీతధారణ నిర్వహించారు. మాంగల్యధారణ రమణీయంగా నిలిచింది. తలంబ్రాల వేడుక అమితానందాన్ని అందించగా, దర్బారు సేవ తన్మయత్వాన్ని నింపింది. ఆదివారం అభిషేకంతో పాటు బంగారు పుష్పార్చన నిర్వహించనున్నారు. 24న పునర్వసును పురస్కరించుకుని ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం చేస్తారు. 25న పుష్యమి సందర్భంగా సీతారామ పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు వైదిక పెద్దలు తెలిపారు.


కల్యాణ పూజ అందుకుంటున్న రాములవారు


కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రణాళికలు రూపొందించండి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ నిధులతో జిల్లా మరింత ప్రగతి సాధించేలా వివిధ శాఖల అధికారులు చొరవ చూపాలని జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ (దిశ) ఛైర్మన్, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్, కమిటీ కోఛైర్మన్, ఖమ్మం ఎంపీ, రామసహాయం రఘురాంరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన 'దిశ' సమీక్షా సమావేశంలో మాట్లాడారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అధికారులు ప్రణాళికలు రూపొందిస్తే.. పార్లమెంట్ సమావేశాల్లో చర్చిస్తామని తెలిపారు. జిల్లా అభివృద్ధికి కావాల్సిన నిధులు, పనుల గురించి ప్రధాని మోదీ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఉపాధి హామీ పథకం పనుల ద్వారా గ్రామాలు, తండాలను మెరుగుపరచాలని చెప్పారు. జిల్లాలో కొత్తగా చేపట్టాల్సిన రహదారులకు సంబంధించిన ప్రతిపాదనలను తమకు అందజేయాలని ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులకు సూచించారు.

సమస్యలను ఏకరవు పెట్టిన ఎమ్మెల్యేలు

అశ్వారావుపేట నియోజకవర్గంలో దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు చేపట్టాలని మూడు నెలలుగా మొరపెట్టుకుంటున్నా అధికారులు స్పందించలేదని, ఇటీవల మంత్రుల పర్యటన నేపథ్యంలో హడావుడిగా రోడ్లపై గుంతలను పూడ్చారని ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మండిపడ్డారు. రహదారులను పరిశీలించి మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యతను విస్మరించటం తగునా అని ప్రశ్నించారు. ఎన్‌హెచ్-30లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, పినపాక- కిన్నెరసాని వంతెన వద్ద పనులు అసంపూర్తిగా ఉన్నాయని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో నెలకు 15 మంది పాముకాటుకు గురవుతున్నా సరైన వైద్యమందటం లేదని, వైద్యులు, ఔషధాల కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. కొత్తగూడెం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ నుంచి కారుకొండ రామవరం వరకు రహదారి ఇరుకుగా ఉండటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడుతోందని ఎమ్మెల్యే మాలోత్ రాందాస్‌నాయక్ పేర్కొన్నారు. సెంట్రల్ లైటింగ్‌తో కూడిన రెండు వరుసల రహదారి నిర్మించాలని గత 'దిశ' సమావేశంలో ప్రస్తావించినా ఇప్పటివరకు అధికారులు కనీసం ప్రతిపాదనలు రూపొందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. భద్రాచలం నియోజకవర్గ పరిధిలోని రహదారులను మెరుగుపరచాలని, ప్రభుత్వాసుపత్రుల్లో సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్ కోరారు. కొత్తగూడెం మున్సిపల్ ఛైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి మాట్లాడుతూ కొత్తగూడెం ప్రభుత్వాసుపత్రిలో మురుగునీటి సమస్యకు పరిష్కారం చూపించాలన్నారు. రామవరం మాతాశిశు సంరక్షణ కేంద్రంలో గర్భిణులకు స్కానింగ్ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై ప్రజాప్రతినిధుల సందేహాలను కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, అధికారులు నివృత్తి చేశారు. సమావేశంలో ఐటీడీఏ పీఓ రాహుల్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, దిశ కమిటీ సభ్యులు ఆనందరావు, సురేష్, మణి, స్వప్న, డీసీఎంఎస్ ఛైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు, ఇల్లెందు మున్సిపల్ ఛైర్మన్ డి.వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్, చిత్రంలో ఎమ్మెల్యేలు మాలోత్ రాందాస్‌నాయక్, పాయం వెంకటేశ్వర్లు, ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యే జారె ఆదినారాయణ

విద్య, పౌష్టికాహారం బాలికల ప్రాథమిక హక్కు

కొత్తగూడెం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: విద్య, పౌష్టికాహారం బాలికల ప్రాథమిక హక్కులని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి అన్నారు. బాబుక్యాంపు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో న్యాయ అవగాహన సదస్సును శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన కల్పించడం అంతర్జాతీయ బాలికల దినోత్సవ ప్రధాన ఉద్దేశం అని వివరించారు. విద్యార్థినులు పట్టుదల, సమయస్ఫూర్తితో విద్యనభ్యసించాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలు బి.నీరజ, ఉపాధ్యాయులు దస్తగిరి, సునందిని, పీడీ స్టెల్లా, న్యాయ సహాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.భానుమతి

కాంగ్రెస్‌ది అబద్ధాల పాలన: పువ్వాడ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: 'ప్రభుత్వం ఏర్పాటయ్యాక వంద రోజులు అడిగారు.. ప్రస్తుతం 310 రోజులైనప్పటికీ ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చలేదు' అని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై పోరాట కార్యక్రమాన్ని ఈ జిల్లా నుంచే మొదలుపెట్టాలని మాజీ మంత్రి భారాస శ్రేణులకు పిలుపునిచ్చారు. కొత్తగూడెంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ, రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు రోజుకో విధంగా మాట్లాడుతున్నారని విమర్శించారు. ఒక మంత్రి మాటకు, మరో మంత్రి మాటకు పొంతన కుదరటం లేదని ఎద్దేవా చేశారు. పచ్చి అబద్ధాలతో ప్రభుత్వం నడుస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చకుండా పేదల ఇళ్లను కూలగొట్టడం వంటి చర్యలకు పాల్పడుతూ చర్చను పక్కదారి పట్టిస్తున్నారని తూర్పారబట్టారు. కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం ప్రభుత్వం బాకీపడిందని వివరించారు. సీతారామ ప్రాజెక్టు కేసీఆర్ హయాంలోనే చేపట్టినా ప్రాజెక్టు మొత్తాన్ని తామే నిర్మించినట్లు.. ఓ మంత్రి నీళ్లను నెత్తిపై చల్లుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు మాట్లాడుతూ.. త్వరలో భద్రాచలం నియోజకవర్గంలో ఉప ఎన్నిక రానుందని, అక్కడ భారాస అభ్యర్థిని గెలిపించి కేసీఆర్‌కు బహుమతిగా ఇవ్వాలని పార్టీ శ్రేణులకు సూచించారు. రైతుల రుణాలు మాఫీ చేయనందుకు నిరసనగా మండల కేంద్రాల్లో ముఖ్యమంత్రి దిష్టిబొమ్మను శనివారం దహనం చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు తాతా మధు, మాజీ ఎమ్మెల్యేలు వనమా వెంకటేశ్వరరావు, మెచ్చా నాగేశ్వరరావు, హరిప్రియ, తాటి వెంకటేశ్వర్లు, భారాస నేతలు రాకేశ్‌రెడ్డి, దిండిగల రాజేందర్, కొత్తగూడెం పుర ఛైర్‌పర్సన్ సీతాలక్ష్మి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పువ్వాడ అజయ్, చిత్రంలో హరిప్రియ, తాతా మధు, వనమా, రేగా, మెచ్చా తదితరులు

ఆస్ట్రేలియా కంపెనీ ప్రతినిధులతో భేటీ

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: కొత్త సాంకేతిక విధానాలపై పరస్పర అవగాహన పెంపొందించుకొనేందుకు సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్టు ప్లానింగ్), (పా) జి.వెంకటేశ్వరరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు, ఆస్ట్రేలియాలోని న్యూసౌత్ వేల్స్ మైనింగ్ టెక్నాలజీ కంపెనీ బృందంతో శనివారం ప్రధాన కార్యాలయంలో సమావేశమయ్యారు. సింగరేణి సాంకేతిక విధానాన్ని జీఎం మనోహర్‌రావు వివరించారు. ఆస్ట్రేలియాలోని అధునాతన టెక్నాలజీని ఆ కంపెనీ ప్రతినిధులు వివరించారు. జీఎంలు సూర్యనారాయణరాజు, సాయిబాబు, రఘురామిరెడ్డి, రాంకుమార్ పాల్గొన్నారు.

మారింది.. ధరణి ధోరణి..!

ఈటీవీ, ఖమ్మం: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ధరణి దరఖాస్తుల పరిష్కార క్రతువు తుది దశకు చేరుకుంది. అనేక చిక్కుముళ్లు, భూసంబంధిత సమస్యలతో ధరణి పోర్టల్‌లో పేరుకుపోయిన అర్జీలపై కొన్నినెలలుగా ఉభయ జిల్లాల రెవెన్యూ యంత్రాంగం కుస్తీపడుతోంది. నాలుగు నెలల క్రితం చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌తో వేల సంఖ్యలో భూసమస్యలను పరిష్కరించింది. కొద్దిమొత్తంలో మిగిలిన అర్జీలనూ ముమ్మరంగా పరిశీలిస్తోంది. ఈనెలాఖరులోగా 100 శాతం దరఖాస్తులకు పరిష్కార మార్గం చూపాలని కలెక్టర్లు భావిస్తున్నారు.



చకచకా పరిష్కారం

ధరణి పోర్టల్‌ను అమల్లోకి తీసుకొచ్చాక రాష్ట్రంలోనే అత్యధికంగా ఖమ్మం జిల్లాలో భూసమస్యలు సర్కారు దృష్టికి వచ్చాయి. వీటికి శాశ్వత పరిష్కారం చూపాలని రైతుల నుంచి అర్జీలను ప్రభుత్వం స్వీకరించింది. ఇందులో భాగంగా ఖమ్మం జిల్లాలో సుమారు 90వేలు, భద్రాద్రి జిల్లాలో 40వేల అర్జీలు అందాయి. 2022 నాటికి ఖమ్మం జిల్లాలో 40వేలు, భద్రాద్రి జిల్లాలో 15వేల దరఖాస్తులు పరిష్కారానికి నోచుకోలేదు. 2024 మే నాటికి ఖమ్మం జిల్లాలో 12వేలు, భద్రాద్రి జిల్లాలో 8,500 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కొలువుదీరిన తర్వాత ధరణి పోర్టల్ స్థానంలో 'భూమాత'ను తీసుకొస్తామని ప్రకటించింది. ఈలోగా 'ధరణి'లో పేరుకుపోయిన దరఖాస్తులకు 100 శాతం పరిష్కార మార్గం చూపాలని ఆదేశించింది. నాలుగు నెలల క్రితం రెవెన్యూ శాఖలో మండల, డివిజనల్, జిల్లా స్థాయి కార్యాలయాల వరకు అధికారులు ప్రత్యేక డ్రైవ్ చేపట్టారు. ప్రధానంగా టీఎం-33 మాడ్యుల్‌లో ఎక్కువ దరఖాస్తులు పేరుకుపోవటంతో దీనిపైనా ప్రత్యేకంగా దృష్టి సారించారు.

దీపావళి నాటికి ప్రక్రియ సమాప్తం

ప్రత్యేక డ్రైవ్ ద్వారా ఖమ్మం జిల్లాలో 10,500 దరఖాస్తులకు మోక్షం లభించగా మరో 1,500 అర్జీలు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయి. భద్రాద్రి జిల్లాలో 7,500 దరఖాస్తులకు పరిష్కారం చూపగా 1,000 అర్జీలు మిగిలాయి. వీటిలో తహసీల్దార్ల వద్ద కొన్ని, ఆర్డీఓల వద్ద ఇంకొన్ని, అదనపు కలెక్టర్, కలెక్టర్ల వద్ద మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి. దీపావళి నాటికి 'భూమాత' పోర్టల్ ఏర్పాటుకు సర్కారు కసరత్తు చేస్తున్న నేపథ్యంలో అప్పటిలోగా ధరణి దరఖాస్తులన్నింటినీ పరిష్కరించాలని రెవెన్యూ యంత్రాంగం భావిస్తోంది.

'ధరణి' పెండింగ్ దరఖాస్తులన్నింటికీ పరిష్కారం చూపేలా ప్రత్యేక డ్రైవ్ చేపట్టాం. ఖమ్మం జిల్లాలో 12వేల దరఖాస్తుల్లో 10,500 అర్జీలకు పరిష్కార మార్గం చూపాం. ఇప్పుడు రోజుకు 200 వరకు దరఖాస్తులను పరిష్కరిస్తున్నాం. దీపావళి నాటికి ఈ ప్రక్రియ పూర్తవుతుంది. – ముజమ్మిల్ ఖాన్, కలెక్టర్, ఖమ్మం

ఉద్యోగ ఫలితాలు విడుదల

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: సింగరేణిలో ఏడు విభాగాల్లో 327 ఉద్యోగాల భర్తీ కోసం నిర్వహించిన రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల జాబితాను సింగరేణి శనివారం ఎస్‌సీసీఎల్ మైన్స్ డాట్‌కంలో ఉంచింది. మేనేజ్‌మెంట్ ట్రైనీ(ఈ.ఎం), మేనేజ్‌మెంట్ ట్రైనీ(సిస్టమ్స్), జూనియర్ మైనింగ్ ఇంజినీర్ ట్రైనీ, అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రైనీ(మెకానికల్), అసిస్టెంట్ ఫోర్మెన్ ట్రైనీ(ఎలక్ట్రికల్), ఫిట్టర్ ట్రైనీ, ఎలక్ట్రీషియన్ ట్రైనీ పోస్టుల భర్తీకి ఆగస్టు 6, 7వ తేదీల్లో రాత పరీక్షలను కంప్యూటర్ ఆధారితంగా నిర్వహించింది. అభ్యర్థుల ఎంపిక జాబితాను సింగరేణి యాజమాన్యం ప్రకటించింది.

ఇద్దరిని కాపాడిన గజ ఈతగాడు

భద్రాచలం పట్టణం: భద్రాచలం వద్ద గోదావరి నదిలో మునిగిపోతున్న ఇద్దరు భక్తులను గజ ఈతగాడు ప్రసాదు శనివారం కాపాడారు. స్నానానికి దిగిన వారు నది లోతు అంచనా వేయక మునిగిపోతుండగా వారిని ఆయన రక్షించారు. దీంతో వారు ఊపిరిపీల్చుకుని అక్కడి నుంచి వెళ్లిపోయారు. బాధితులకు సంబంధించిన సమాచారం తనకు తెలియదన్నారు.

తేజోవంతులు...

అన్నదమ్ములిద్దరూ ప్రభుత్వ ఇంజినీర్లే..

బోనకల్లు, న్యూస్‌టుడే

చాలా పేద కుటుంబంలో జన్మించిన ఆ అన్నదమ్ముల పేరు చివరన 'తేజ' అనే పదం వస్తుంది. పేరుకు తగ్గట్టు చదువుల్లో ఇద్దరూ తేజోవంతులే. ఆర్థికంగా లేకున్నా విద్య విలువ తెలుసుకుని కష్టపడి చదివారు.. చివరకు ఇద్దరూ ప్రభుత్వ ఇంజినీర్లుగా కొలువులు సాధించారు. వారే బోనకల్లు గ్రామానికి చెందిన చల్లా రవితేజ, చల్లా కృష్ణతేజలు. బోనకల్లు గ్రామానికి చెందిన చల్లా శ్రీనివాసరావు, రమాదేవి దంపతులకు ఇద్దరు కుమారులు. శ్రీనివాసరావు చిన్న ప్రింటింగ్ ప్రెస్ నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. రమాదేవి రూ.500తో విద్యా వాలంటీర్‌గా పనిచేసి వేడినీళ్లకు చన్నీళ్ల మాదిరిగా కుటుంబానికి తోడుగా నిలుస్తుండేవారు. కుమారులు రవితేజ, కృష్ణతేజ.. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు విద్యనభ్యసించారు. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అర్థం చేసుకున్న వారు ఆదినుంచీ చదువుల్లో ముందుండేవారు. ఆటుపోట్లను అధిగమిస్తూ ఫీజు రీఎంబర్స్‌మెంట్ ద్వారా ఖమ్మంలోని ప్రైవేటు కళాశాలలో మెకానికల్ విభాగంలో ఇంజినీరింగ్ పూర్తి చేశారు.


రవి తేజ, కృష్ణ తేజ

★ పెద్ద కుమారుడు రవితేజ బీటెక్ అనంతరం ఎంటెక్ పూర్తి చేశారు. ఆరేళ్ల క్రితం టీఎస్‌పీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీ పరీక్షలకు సిద్ధమయ్యారు. జెన్‌కోలో ఏఈగా ఉద్యోగం సంపాదించి ప్రస్తుతం భద్రాద్రి పవర్ ప్లాంట్‌లో పనిచేస్తున్నారు.

★ కృష్ణతేజ ఎంటెక్ పూర్తయిన అనంతరం నిట్‌లో మెకానికల్ ఇంజినీరింగ్ విద్యలో పీహెచ్‌డీ చేస్తూనే తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నోటిఫికేషన్‌కు సిద్ధమయ్యారు. కొద్దికాలం క్రితం నీటిపారుదల శాఖలో ఏఈఈగా కొలువు దక్కించుకున్నారు. సెప్టెంబరు 24న ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకుని సత్తుపల్లి నియోజకవర్గం బంజరలో పనిచేస్తున్నారు. పట్టుదల ఉంటే సాధించలేనిది ఉండదని సోదరులిద్దరూ నిరూపించారు. స్థానిక యువతకు స్ఫూర్తిదాయకంగా నిలవటమేకాదు స్థానికుల అభిమానానికి పాత్రులయ్యారు.

పురుగు మందు తాగి ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ ఆత్మహత్య


లకావత్ ముకుందం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: పురుగుమందు తాగి అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న వ్యక్తి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఖమ్మం నగరంలో శనివారం రాత్రి వెలుగుచూసింది. ఖానాపురం హవేలీ పోలీసుల కథనం ప్రకారం... ఖమ్మం నగరం శ్రీశ్రీ కూడలి సమీపంలోని ఓ బహుళ అంతస్తుల భవనంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ అటవీ శాఖలో సెక్షన్ ఆఫీసర్‌గా పని చేస్తున్న లకావత్ ముకుందం(50) కుటుంబం నివసిస్తోంది. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. వారు ఊరు వెళ్లడంతో ముకుంద ఒక్కరే ఉన్నారు. ఆయనకు ఫోన్ చేస్తే ఎత్తకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో తన నివాసంలో పరిశీలించగా చనిపోయి కనిపించారు. గుర్తు తెలియని పురుగుమందు తాగినట్లు భావిస్తున్నారు. ఆయన బలవన్మరణానికి ఇంకా కారణాలు తెలియరాలేదు. అన్నం సేవాశ్రమం నిర్వాహకుడు అన్నం శ్రీనివాసరావు బృందం ఆధ్వర్యంలో ముకుంద మృతదేహాన్ని సర్వజనాసుపత్రి శవాగారానికి తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భర్త మృతి.. మనోవేదనతో భార్య..

ఖమ్మం నేరవిభాగం: భర్త మృతి చెందిన మనో వేదనతో ఎలుకల మందు తాగి మహిళ బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... తల్లాడ మండలం వెంకటాపురానికి చెందిన సాలికల రామకృష్ణ, కృష్ణవేణి(33) దంపతులు ఖమ్మం నగరంలోని బ్యాంకు కాలనీలో ఓ బహుళ అంతస్తుల భవనంలో వాచ్‌మెన్‌గా ఉంటున్నారు. ఎనిమిది నెలల కిందట రామకృష్ణ స్నానాల గదిలో జారిపడి మృతి చెందారు. వారికి ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. నాటి నుంచి అక్కడే ఉంటున్న కృష్ణవేణి మనోవేదనతో ఎలుకల మందు తాగింది. ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ఉరేసుకుని మహిళ బలవన్మరణం

ఖమ్మం నేరవిభాగం, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో భర్త నుంచి విడిపోయి జీవిస్తున్న మహిళ ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడిన సంఘటన ఖమ్మం రెండో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలో శనివారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణ కథనం ప్రకారం... పెనుబల్లి మండలం మొండికుంటకు చెందిన మద్దినేని సరస్వతి(32)కి తల్లాడకు చెందిన నరేశ్‌తో వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ కలహాలతో రెండేళ్లుగా విడిపోయి ఏడేళ్ల కుమార్తెతో ఖమ్మం ఉపేంద్రయ్యనగర్‌లోని ఓ బహుళ అంతస్తుల భవనంలో నివాసం ఉంటోంది. బ్యూటీషియన్‌గా పని చేస్తున్న ఆమె కొన్ని రోజులుగా ముభావంగా ఉంటోందని చుట్టుపక్కలవారు తెలిపారు. ఈ క్రమంలో శనివారం ఉదయం నిద్ర లేచిన కుమార్తెకు తల్లి ఉరికి వేలాడుతూ కనిపించడంతో అమ్మమ్మకు వీడియో కాల్ చేసి రోదిస్తూ సమాచారం ఇచ్చింది. ఆపై స్టూల్ వేసుకుని తలుపు తెరచి బయటకు వచ్చిన ఆ చిన్నారి రోదిస్తూ పక్కన నివసించేవారికి చెప్పింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు, అన్నం సేవా బృందం ఆమె మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రి శవాగారానికి తరలించారు. మృతురాలి తండ్రి నరసింహారావు ఫిర్యాదు మేరకు కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

క్షణికావేశంలో యువకుడు..

రఘునాథపాలెం, న్యూస్‌టుడే: ఉరి వేసుకుని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన సంఘటనపై రఘునాథపాలెం పోలీసు స్టేషన్‌లో శనివారం కేసు నమోదైంది. ఇన్‌స్పెక్టర్ ఉస్మాన్ షరీఫ్ కథనం ప్రకారం... శివాయిగూడేనికి చెందిన గార్లపాటి కల్యాణ్(23) నగరంలోని ఓ ల్యాబ్‌లో పని చేస్తున్నారు. అతను ముదిగొండ మండలానికి చెందిన ఓ యువతిని ప్రేమించారు. ఈ విషయమై తల్లిదండ్రులు మందలించారు. ఈ క్రమంలో శుక్రవారం అతను ప్రేమించిన యువతితో చరవాణిలో వాదన జరిగింది. అనంతరం క్షణికావేశంలో అతను ఇంటిలో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కేసు విచారణ చేపట్టినట్లు ఇన్‌స్పెక్టర్ వివరించారు.

ప్రాణం తీసిన చేపల వేట


వెంకటేశ్వరరావు

వేంసూరు: అమ్మపాలెంలో చేపల వేటకు వెళ్లిన పుచ్చా వెంకటేశ్వరరావు(34) అనే వ్యక్తి చెరువులో మునిగి మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. పుచ్చా వెంకటేశ్వరరావు అనే యువకుడు మరికొందరితో కలిసి అమ్మపాలెం పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్తున్నాడు. ఈతరాని వెంకటేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం చెరువులో లోతుగా ఉన్న ప్రాంతానికి వెళ్లి మునిగిపోయాడు. సహచరులు ఇది గమనించలేదు. చీకటిపడి ఇళ్లకు వచ్చిన తర్వాత వెంకటేశ్వరరావు రాలేదని గుర్తించారు. అతను చెరువులో మునిగిపోయి ఉంటాడని భావించి శనివారం ఉదయం పోలీసులు, తహసీల్దారు రాజుకు సమాచారం అందించారు. గజ ఈతగాళ్ల సాయంతో సాయంత్రం మృతదేహాన్ని వెలికితీశారు. పోస్టుమార్టం నిమిత్తం సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై వీరప్రసాద్ కేసు నమోదు చేశారు.

అండర్-14 టీటీ జట్లు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: అండర్ 14 టేబుల్ టెన్నిస్ జట్లను శనివారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొనే ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలుర జట్టులో ఎస్.కె. సొహైల్ ఫజల్, జి.చార్విక్, కె. హితేష్, తరుణ్, హరి, సోమశేఖర్, ఎం.డి. అనాస్, బాలికల జట్టులో బి.సాయి శివానీ, ఎస్.కె. జవేరియ, డి.ఉజ్వల, టి.అక్షయ, పి.హర్షిత, షైనీ, రోజా ఉన్నారు. స్కూల్ గేమ్స్ సమాఖ్య సభ్యుల సమక్షంలో శిక్షకుడు సాంబమూర్తి ఎంపికల ప్రక్రియను పూర్తి చేశారు.

అంతర కళాశాలల క్రీడాపోటీలు షురూ

సుబేదారి, న్యూస్‌టుడే: విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు అవసరమని కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి అన్నారు. హనుమకొండ సుబేదారి ఆర్ట్స్ కళాశాల మైదానంలో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని అంతర్ కళాశాలల క్రీడా పోటీలను శనివారం ప్రారంభించారు. క్రీడల వల్ల విద్యార్థుల మధ్య స్నేహభావం పెరుగుతుందన్నారు. కేయూ క్రీడా విభాగం సంచాలకుడు వెంకయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు వేళల్లో మార్పు

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ఖమ్మం రైల్వేస్టేషన్ మీదుగా వెళ్లే సింహపురి ఎక్స్‌ప్రెస్ రైలు(సికింద్రాబాద్-గూడూరు) వేళల్లో దక్షిణ మధ్య రైల్వే అధికారులు మార్పులు చేసినట్లు ఖమ్మం రైల్వే చీఫ్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ ఎండీ.జాఫర్ శనివారం తెలిపారు. ఈనెల 19వ తేదీ నుంచి వేళలు మారుతాయని, ప్రయాణికులు ఈ విషయాన్ని గమనించి రాకపోకలు సాగించాలని సూచించారు.

మారిన వేళలు ఇలా..

రైల్వేస్టేషన్	మారిన సమయం
ఖమ్మం	01:39
కొండపల్లి	03:25
విజయవాడ	03:35

గ్యాస్ లీకేజీ మంటలతో వ్యక్తికి గాయాలు

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలోని కూనవరం రోడ్‌లో ఓ బిర్యాని హోటల్‌లో గ్యాస్ లీకేజీతో ఏర్పడిన మంటలకు అక్కడ పనిచేస్తున్న ఖాన్ అనే వ్యక్తికి శనివారం గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పట్టణంలోని హోటళ్లలో భద్రతా లోపాలు ఉన్నాయి. అగ్నిమాపక శాఖ నిబంధనలను పాటించకపోవడంతో పలు ప్రమాదకర ఘటనలు చోటు చేసుకుంటున్నాయి. సంబంధిత అధికారులు దృష్టి సారించాల్సి ఉంది.

వైద్యమందక ఆరు నెలల పసికందు కన్నుమూత..!


పాప మృతదేహం

చర్ల, న్యూస్‌టుడే: చర్ల మండలం లెనిన్‌కాలనీకి చెందిన ఆరు నెలల పసిపాప సరైన వైద్యం అందక శనివారం మృతి చెందిందని తల్లిదండ్రులు మిచ్చా నాగరాజు, కృష్ణవేణి దంపతులు ఆరోపించారు. తమ బిడ్డకు శ్వాస సమస్యతో పాటు మూత్రం, మలం రాక ఇబ్బందులు పడుతుండగా చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి శుక్రవారం అర్ధరాత్రి తీసుకెళ్లామన్నారు. అక్కడి ప్రాథమిక వైద్యం అందించి భద్రాచలం రిఫర్ చేశారని తెలిపారు. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి శనివారం వేకువజామున 2 గంటలకు తీసుకెళ్లిన సమయంలో అక్కడ విధుల్లో డాక్టర్ లేరని.. గంట పాటు వేచి చూశామన్నారు. తమ బిడ్డను రక్షించుకునేందుకు ప్రైవేటు అంబులెన్సులో ప్రైవేటు ఆసుపత్రులకు తిప్పినా ఏఒక్క డాక్టర్ అందుబాటులో లేరన్నారు. ఓ ఆసుపత్రికి తీసుకెళ్లగా పల్స్ పడిపోయిందని చేర్చుకోలేదని, దీంతో తిరిగి మళ్లీ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని.. ఉదయం 8 గంటలకు పాప మృతి చెందిందని వారు వాపోయారు. సమయానికి ఏ ఒక్క డాక్టరయినా ఉండి ఉంటే తమ బిడ్డ బతికేదని తల్లిదండ్రులు విలపిస్తూ తెలిపారు.

★ ఈ ఘటనపై చర్ల వైద్యాధికారి డాక్టర్ సాయివర్ధన్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తమ వద్దకు పాపను తెల్లవారుజామున ఒంటి గంట సమయంలో తీసుకొచ్చారని.. అప్పటికే పాప పరిస్థితి విషమంగా ఉండగా ప్రాథమిక వైద్యం అందించి అంబులెన్సులో భద్రాచలం రిఫర్ చేశామన్నారు. భద్రాచలం ప్రాంతీయ వైద్యశాల సూపరింటెండెంట్ డా. రామకృష్ణను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా తెల్లవారుజామున 5 గంటల సమయంలో భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారని.. విధుల్లో ఉన్న వైద్యులు పరీక్షించి ఆక్సిజన్ పెట్టారని.. పాప పరిస్థితి విషమంగా ఉందని వివరించడంతో ప్రైవేటు ఆసుపత్రికి వెళతామని తీసుకెళ్లారని.. భద్రాచలంలో పలు చోట్ల తిరిగినా ఎవ్వరూ అందుబాటులో లేకపోవడంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకువచ్చారని అప్పటికే పాప పరిస్థితి చేయి దాటిపోయిందని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో అశ్వాపురం యువతి మృతి


సుజాత

అశ్వాపురం, న్యూస్‌టుడే: విజయవాడ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అశ్వాపురానికి చెందిన మైప సుజాత(30) అనే యువతి మృతి చెందింది. అశ్వాపురానికి చెందిన వీరయ్య, చిట్టెమ్మల కుమార్తె సుజాత. ఆమె భర్త భర్త పరశురాంతో కలిసి విజయవాడలో ఉంటున్నారు. ఆమె ఆసుపత్రికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా ఓ లారీ ఢీకొట్టింది. ఆమెను వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శనివారం రాత్రి కుటుంబసభ్యులు విజయవాడ నుంచి అశ్వాపురం తరలించారు.

టిప్పర్ మరమ్మతు ఖర్చులు చెల్లించండి

ఖమ్మం న్యాయవిభాగం, న్యూస్‌టుడే: ప్రమాదంలో దెబ్బతిన్న టిప్పర్ వాహనానికి మరమ్మతు ఖర్చులు రూ.1,37,000 చెల్లించాలని బీమా కంపెనీని ఆదేశిస్తూ ఖమ్మం జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ తీర్పు చెప్పింది. కేసు వివరాల ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచకు చెందిన కిషోర్ తన టిప్పర్‌ను ఓ లిమిటెడ్ కంపెనీలో అద్దెకు నడిపిస్తున్నారు. 2023 సెప్టెంబరు 27న అది ప్రమాదానికి గురైంది. దాని మరమ్మతు ఖర్చులు చెల్లించాలని చోళా బీమా కంపెనీని ఆశ్రయించడంతో వారు పట్టించుకోలేదు. జిల్లా వినియోగదారుల కమిషన్‌లో కేసు దాఖలు చేయగా ఆ వాహనం నడిపిన డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగింది కాబట్టి క్లెయిమ్‌ను తిరస్కరించామని బీమా కంపెనీ వాదించింది. ఇరుపక్షాల వాదనలు విన్న ఛైర్‌పర్సన్ వి.లలిత, సభ్యురాలు ఎ.మాధవీలత బీమా కంపెనీ సేవా లోపాన్ని నిర్ధారించారు. మరమ్మతు ఖర్చులు రూ.1,37,000 లతోపాటు ఫిర్యాదుదారు మనోవేదన చెందినందుకు రూ.10 వేలు, కేసు ఖర్చుల కింద రూ.10 వేలు చెల్లించాలని ఆదేశించారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -130 రిటైల్ ధర 152 చికెన్ విత్ స్కిన్ - 220, చికెన్ స్కిన్‌లెస్ - 251.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం

ఈనాడు కథనానికి స్పందన

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: 'దాతలు స్పందిస్తే ఆ ఊరిలో తొలి వైద్యుడు' శీర్షికన 'ఈనాడు'లో రెండు రోజుల క్రితం ప్రచురితమైన కథనానికి దాతల నుంచి స్పందన లభిస్తోంది. ఎంబీబీఎస్ సీటు సాధించిన నేలకొండపల్లి మండలం సుర్దేపల్లికి చెందిన శ్రీపతి ఆర్థిక పరిస్థితిపై ఆరా తీసి తోచిన సాయం అందిస్తున్నారు. శనివారం ఆంధ్రజ్యోతి మిక్కిలినేని రూ.20 వేలు, సీవీ కామేశ్వర్‌రావు రూ.20 వేలు, వాసిరెడ్డి హెల్త్‌కేర్ ఫౌండేషన్ రూ.5 వేలు, జెట్టి మాధురి రూ.2 వేలు, డి.లోకనాథ్‌రెడ్డి రూ.2251ను విద్యార్థి శ్రీపతి ఖాతాకు జమచేశారు. మొత్తంగా రూ.50 వేలు శనివారం అందాయి. స్పందించిన దాతలకు, 'ఈనాడు'కు విద్యార్థి శ్రీపతి ధన్యవాదాలు తెలిపారు. తన చదువుల కోసం అయ్యే ఖర్చు, తన ఆర్థిక పరిస్థితి దృష్ట్యా మరింత చేయూత కోసం వేచిచూస్తున్నారు.

17 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సులో తరలిస్తున్న 17 కిలోల ఎండు గంజాయిని శనివారం పట్టుకున్నట్లు భద్రాచలం ఎస్సై విజయలక్ష్మి తెలిపారు. జగదల్‌పూర్ నుంచి హైదరాబాద్ గంజాయి తరలిస్తున్న కర్ణాటకకు చెందిన ఎం.గణేశ్ అనే వ్యక్తిని విశ్వసనీయ సమాచారం మేరకు భద్రాచలం బస్టాండులో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి దొరికిందన్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మావోయిస్టు ఏరియా కమిటీ, దళ సభ్యుల లొంగుబాటు


వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ బి.రోహిత్‌రాజు

కొత్తగూడెం పట్టణం, న్యూస్‌టుడే: నిషేధిత మావోయిస్టు పార్టీకి చెందిన ఇద్దరు ఏరియా కమిటీ సభ్యులు, ఓ దళ సభ్యుడు జిల్లా పోలీసులు, 141 ఏరియా బెటాలియన్ సీఆర్‌పీఎఫ్ అధికారుల ఎదుట లొంగిపోయినట్లు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ బి.రోహిత్‌రాజు తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. లొంగిపోయిన మావోయిస్టు పార్టీ సభ్యుల్లో పొడియం మంగు అలియాస్ దేవేందర్(26) ఏసీఎం తుమ్రేల్ గ్రామం, బీజాపూర్ జిల్లా, మడివి అడిమే అలియాస్ అనూష(23) ఏసీఎం, చర్ల మండలం, కొరకట్ పాడు గ్రామం, మరొకరు ఆంధ్రప్రదేశ్‌లోని గొల్లగుప్ప గ్రామానికి చెందిన కుడం సోమల్(22) దళ సభ్యుడు ఉన్నట్లు తెలిపారు. ఈ ముగ్గురూ 2018-19లో నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో బీకేఏఎస్ఆర్ డివిజన్‌లో చర్ల ప్లటూన్‌లో సాయుధ దళ సభ్యులుగా చేరారు. అనంతరం మంగు, అడిమే ఇద్దరూ ఏరియా కమిటీ సభ్యులుగా ప్రమోషన్ పొందారు. ఇప్పటి వరకు వీరు నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ చర్ల ప్లటూన్‌లో పని చేశారు. ఒక్కొక్కరిపై రూ.4లక్షల రివార్డు ఉంది. జిల్లా పోలీసులు ఏర్పాటు చేసిన ఆపరేషన్ చేయూత ద్వారా కౌన్సెలింగ్ కార్యక్రమంలో హాజరైన కుటుంబ సభ్యులు మావోయిస్టు పార్టీలో పని చేస్తున్న వారి కుటుంబ సభ్యులను బయటికి తీసుకురావటానికి ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే జనజీవన స్రవంతిలో కలిసి సాధారణ జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని లొంగిపోతున్నట్లు తెలిపారు. ప్రస్తుతం మావోయిస్టులకు మనుగడ లేదని, వారి సిద్ధాంతాలపై గిరిజనులు నమ్మకం పూర్తిగా కోల్పోయారని పేర్కొన్నారు. లొంగిపోయి సాధారణ జీవనం గడపాలనుకునే దళ సభ్యులు వారి కుటుంబ సభ్యుల ద్వారా, స్వయంగా పోలీసుల ఎదుట లొంగిపోవచ్చని వివరించారు. వారికి జీవనోపాధితో పాటు ప్రభుత్వం నుంచి రావాల్సిన అన్ని రకాల ప్రతి ఫలాలను అందించేందుకు పోలీస్ యంత్రాంగం తరపున కృషి చేస్తామని చెప్పారు. ఓఎస్డీ సాయిమనోహర్, సీఐ అశోక్ పాల్గొన్నారు.

భద్రాచలం

• భద్రాచలం • పినపాక • అశ్వారావుపేట



గొల్లగూడెం వద్ద ఆకాశంలో ఆవిష్కృతమైన సుందర దృశ్యం

అటు కారుమబ్బులు.. ఇటు వెలుగురేఖలు..!

ఆకాశం నిండా నల్లనిమబ్బులు.. నేల మీదకు జాలువారి ఎక్కడో వర్షం కురుసున్న ఆనవాళ్లు. మరో వైపున నల్లని మబ్బుల చాటున పసిడి వర్ణంలో కాంతులు వెదజల్లుతున్న సాయం సమయ సూర్యుడు. ఎండా వాన.. కలిసొచ్చిన సుందర దృశ్యం గొల్లగూడెంలోని సీతారామ ప్రాజెక్టు వద్ద ప్రధాన రహదారిపై శనివారం సాయంత్రం ఆవిష్కృతమైంది. – అశ్వాపురం, న్యూస్‌టుడే

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: అన్నపురెడ్డిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణం వైభవంగా సాగింది. మండల వ్యాప్తంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, కల్యాణాన్ని తిలకించారు. ఆలయంలోని స్వామి వారికి అర్చనలు, అభిషేకాలు చేశారు.

'దుకాణాలు కోల్పోయిన వారిని ప్రభుత్వం ఆదుకోవాలి'

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: రహదారి విస్తరణ, మురుగునీటి కాలువల నిర్మాణంలో దుకాణాలు కోల్పోయి వీధినపడ్డ వారిని ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు సయ్యద్ సలీం డిమాండు చేశారు. అశ్వారావుపేటలోని పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన మండల సమితి సమావేశం అనంతరం విలేకరులతో మాట్లాడారు. రహదారుల విస్తరణ, కాలువల నిర్మాణాన్ని సీపీఐ స్వాగతిస్తోందని, అయితే బాధితులను ఆదుకోవాల్సిన బాధ్యతను ప్రభుత్వం విస్మరించరాదని పేర్కొన్నారు. గన్నిన రామకృష్ణ, వగ్గెల అర్జున, సత్యవతి, సూర్యకుమారి, రసూల్, జలాల్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయురాలి విరాళం

అశ్వారావుపేట, న్యూస్‌టుడే: సావిత్రీ బాయి పూలే బీసీ బాలికల గురుకులంలో పీజీటీగా పని చేసి డీఎస్సీలు స్కూలు అసిస్టెంటుగా ఎంపికై కల్లూరు ఉన్నత పాఠశాలకు వెళుతున్న లావణ్య ఇంతకాలం తాను పనిచేసిన గురుకులానికి తన వంతు ఉడతాభక్తి సాయంగా రూ.10వేలు విరాళంగా ప్రిన్సిపల్ నిరోషాకు అందజేశారు. గురుకులం అభివృద్ధికి వినియోగించాలని కోరారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పలు గ్రామాల్లో వరికోతలు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటయ్యేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి అన్నవరపు కనకయ్య డిమాండు చేశారు. శనివారం జానకీపురంలో నిర్వహించిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జంగిలి వెంకటరత్నం, వెంకన్న పాల్గొన్నారు.

కేజీబీవీని సందర్శించిన జీఈసీవో

చంద్రుగొండ, న్యూస్‌టుడే: చంద్రుగొండలోని కస్తూర్బా విద్యాలయాన్ని శనివారం జిల్లా లింగ సమానత్వ కోఆర్డినేటర్ (జీఈసీవో) అన్నమణి సందర్శించారు. దస్త్రాలను పరిశీలించారు. కేజీబీవీలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశంలో పాల్గొన్నారు. అనంతరం కేజీబీవీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నూతన సాంకేతిక పద్ధతుల్లో విద్యార్థినులకు బోధన చేయాలన్నారు.

విద్యార్థులకు ఉపకారవేతనాలు

బూర్గంపాడు, న్యూస్‌టుడే: పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటిన ఐటీసీ కాంట్రాక్టు కార్మికుల పిల్లలకు ఐటీసీ అనుబంధ రోటరీక్లబ్ ఆఫ్ ఇన్ భద్రా ఆధ్వర్యంలో శనివారం ఉపకార వేతనాలు అందజేశారు. అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని చదువుల్లో రాణించాలని సూచించారు. ఐటీసీ యూనిట్ హెడ్ శైలేంద్రసింగ్, రోటరీక్లబ్ అధ్యక్షుడు డీవీఎం నాయుడు, సాయిరాం, జేకే దాస్, శ్యాంకిరణ్, డేవిడ్ ఒలీవర్ పాల్గొన్నారు.

భాజపాలో చేరిక

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: కేంద్రంలో భాజపా ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పలువురు స్వచ్ఛందంగా భాజపాలో చేరుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జంపన సీతారామరాజు అన్నారు. మణుగూరులోని రామానుజవరం పంచాయితీకి చెందిన పలు కుటుంబాలు శుక్రవారం రాత్రి భాజపాలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. భిక్షపతి, రవి, హరిప్రసాద్, అశోక్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త గనుల ఏర్పాటుకు సీఎండీకి వినతి

మణుగూరు పట్టణం, న్యూస్‌టుడే: మణుగూరు ఏరియాలో కొత్త బొగ్గు గనులు ఏర్పాటు చేయాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ బలరాంకి శనివారం వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు నాజర్‌పాషా మాట్లాడుతూ.. బొగ్గు ఉత్పత్తి కొనసాగుతున్న గనులకు విస్తరణ అనుమతులు తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. మణుగూరులో గ్రీవెన్సుడే ఏర్పాటు చేయాలన్నారు. పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

సమస్యలుంటే తెలపండి: డీఎస్పీ

అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణతోపాటు వ్యక్తిగత అంశాల్లో ఏమైనా సమస్యలుంటే తెలపాలని పాల్వంచ డీఎస్పీ సతీశ్ కుమార్ సిబ్బందిని కోరారు. శనివారం అశ్వారావుపేట ఠాణాను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలీసు సిబ్బందితో వేర్వేరుగా మాట్లాడారు. శాంతి భద్రతల పరిరక్షణలో కఠినంగా వ్యవహరించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. అనంతరం నేరాలకు సంబంధించిన దస్త్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో సీఐ కరుణాకర్, ఎస్సై యయాతిరాజు పాల్గొన్నారు.

చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

గుండాల, న్యూస్‌టుడే: చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఇల్లెందు డీఎస్పీ చంద్రభాను అన్నారు. శనివారం గుండాల ఠాణాను ఆకస్మికంగా సందర్శించారు. వివిధ రిజిస్టర్లను పరిశీలించారు. సీఐ రవీందర్, ఎస్సై రాజమౌళితో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ యువకులు, ప్రజలు మావోయిస్టులకు సహకరించడంతోపాటు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడితే ఉపేక్షించేదిలేదని హెచ్చరించారు. అనుమానిత వ్యక్తులపై ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటుచేయాలని సూచించారు.

'కుల ధ్రువపత్రాల జారీకి పోరాటం'

చర్ల, న్యూస్‌టుడే: కుల ధ్రువీకరణ పత్రాల జారీని అర్ధాంతరంగా నిలిపివేసిన అంశంపై భవిష్యత్ పోరాటాలను ఉద్ధృతం చేస్తామని గొత్తికోయ యువసేన ప్రాంతీయ అధ్యక్షుడు మడకం చందు హెచ్చరించారు. చర్లలోని సంతపాకలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూల ఆదివాసీలమైన తమకు అధికారులు వివక్షతోనే కోయ కుల ధ్రువీకరణాల జారీ నిలిపివేశారని విమర్శించారు. దీనిపై న్యాయపరంగా ముందుకు సాగుతామన్నారు. దిర్దో రఘు, ఉంగయ్య, భద్రయ్య, కోశయ్య, రాజు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రామాలయ పరిసరాల భూసేకరణకు సన్నాహాలు

భద్రాచలం, న్యూస్‌టుడే

భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా తొలి విడతగా మాడ వీధులను విస్తరించేందుకు సన్నాహాలు మొదలయ్యాయి. ఆర్డీఓ దామోదర్‌రావు నేతృత్వంలో రెవెన్యూ సిబ్బంది శనివారం సర్వే చేపట్టారు. కోవెలకు సమీపంలో దుకాణాలను ఇళ్లను పరిశీలించారు. వాటి యజమానుల సమక్షంలో ఇంటి కొలతలను సేకరించారు. ఆ ఇంటి ప్రాంగణంలో ఖాళీ స్థలం ఎంత ఉందో గుర్తించారు. రామాలయానికి దక్షిణం వైపున ఎక్కువ ఇళ్లు ఉన్నాయి. ఇదే వైపున శివాలయం, హరనాథ్‌బాబా ఆలయాలు ఉండడంతో వాటికి దిగువన ఈ సర్వే కొనసాగించారు. పరిహారంలో స్పష్టత రాకుండా సర్వే ఎలా చేస్తారంటూ కొందరు అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ఇప్పుడు చేసేది కేవలం సర్వే మాత్రమేనని.. ఆ తర్వాత ఇంజినీరింగ్ అధికారులు వచ్చి ఇళ్లను పరిశీలించి విలువను అంచనా వేస్తారని అధికారులు సర్దిచెప్పి ఈ ప్రక్రియను కొనసాగిస్తున్నారు. అందుబాటులో లేనివారికి సమాచారం చేరవేశారు. మరో రెండ్రోజుల్లో ఇది పూర్తి కానుంది.

ఇళ్ల సర్వే చేపట్టిన రెవెన్యూ అధికారులు



మాడవీధిలో దుకాణం కొలతలు తీస్తున్న సిబ్బంది

నిధులు సరిపోయేనా..

ఆలయ మాడవీధుల్లో 46 ఇళ్లు ఉన్నాయి. వీటి పరిధిలో 1.2 ఎకరాల స్థలం ఉంది. దీన్ని స్వాధీనం చేసుకునేందుకు ఇప్పటికే రూ.60.20 కోట్లు మంజూరయ్యాయి. నిర్వాసితులకు నష్ట పరిహారం ఇవ్వడంతో పాటు ఇంటి స్థలాలను కేటాయించాల్సి ఉంది. ప్రభుత్వం పరిధిలో పట్టణంలో పలు చోట్ల స్థలాలు ఉన్నట్టు రెండేళ్ల కిందట చేసిన సర్వేలో తేలింది. ఇందులో బాధితులకు ఇంటి జాగాను కేటాయించాల్సి ఉంది. ఇంటి నిర్మాణాలకు నిధులు ఇస్తారా.. లేదా అన్నది స్పష్టత రావాలి. పరిహారం పంపిణీపై ఇరు పక్షాలు పట్టింపులకు పోకుండా ఉంటేనే ఇది ముందుకు కదులుతుందని అంచనా వేస్తున్నారు. ప్రభుత్వం చెప్పిన ధరకే ఇళ్లను అప్పగించాలంటే మాడ వీధుల విస్తరణకు ఆటంకాలు తప్పవని అంటున్నారు. ఆలయ పరిసరాలలో ఉన్న డిమాండ్‌ను పరిగణలోకి తీసుకుని న్యాయం చేయాలన్నది ఇక్కడి ఇళ్ల యజమానుల వాదన. ఇలా చేస్తే వచ్చిన నిధులు సరిపోతాయా లేదా అన్నది త్వరలో తేలనుంది.

గత అనుభవాలను గుర్తించాలి

✦ మాడవీధుల అంశం 2011 నుంచే ఉంది. అప్పట్లోనే కొన్ని ఇళ్లను స్వాధీనం చేసుకుని పరిహారం చెల్లించారు. కొందరు దీనికి అనుకూలంగా ఉండగా, ఇంకొందరు న్యాయపోరాటం చేసి కోరుకున్న పరిహారాన్ని పొందారు.

✦ దేవస్థానం ఇలా తీసుకున్న స్థలంలో అనుకున్న స్థాయిలో అభివృద్ధి పనులు చేయలేకపోయింది. అప్పట్లో పంచాయతీరాజ్ శాఖ రెవెన్యూ శాఖలు పరిహారాన్ని పంచాయి.

✦ ఆ రోజుల్లో ఇళ్లను తీసుకున్నప్పటికీ వీటికి అనుకుని ఉన్న జాగాలను తీసుకోలేదు. ఇదే అదనుగా ఆ మిగిలిన స్థలంలో మళ్లీ ఇళ్ల నిర్మాణాలకు ఓ అధికారి నిరభ్యంతర పత్రాలను ఇచ్చి నిర్వాకం వెలగబెట్టారు.

✦ ఇలాంటి స్థలంలో నిర్మించిన ఇళ్లనూ ఇప్పుడు స్వాధీనం చేసుకోవాల్సి వస్తోంది. సమన్వయ లోపంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఇలాంటి సమస్యలను గుర్తించాలి.

✦ ఈ మాడవీధులు పూర్తయితే భవిష్యత్తులో ఇక్కడ మరో రహదారి వస్తుంది. అభివృద్ధి పనులకు రూ.వందల కోట్లు వస్తాయని ఊరిస్తుండడంతో మూడు కొత్త ప్రాకారాలు గోపురాలతో రామాలయం అభివృద్ధి సాధ్యమని భక్తులు భావిస్తున్నారు.

పదోన్నతిపై వెళ్తున్న న్యాయమూర్తికి సన్మానం



భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌గా పనిచేసి సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతిపై వికారాబాద్ కోర్టుకు వెళ్తున్న మేజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లుకు భద్రాచలం బార్ అసోసియేషన్ శనివారం ఘన సన్మానం చేసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటా దేవదానం ఆధ్వర్యంలో న్యాయమూర్తికి వీడ్కోలు సభ కోర్టు ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లీగల్ లిటరసీ కార్యక్రమం ద్వారా ఎంతో మందికి న్యాయమూర్తి అవగాహన కల్పించారని, లోక్ అదాలత్ ద్వారా వందల కేసులు పరిష్కరించారని కొనియాడారు. ఆదివాసీ న్యాయవాదుల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా సన్మానం చేశారు. కార్యక్రమంలో పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

క్రీడా నైపుణ్యం పెంపొందించుకోవాలి

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: క్రీడాకారులు తమ క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు అన్నారు. ములకపాడు క్రీడా మైదానంలో నిర్వహించిన క్రికెట్ క్రీడా పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ఆయన బహుమతులు అందజేశారు. యువత క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకొని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవాలని అన్నారు. మట్టా శివాజీ, అబ్బులు, శేఖర్ పాల్గొన్నారు.

కుమురం భీం అడుగుజాడల్లో నడవాలి

దమ్మపేట, న్యూస్‌టుడే: ఆదివాసీ పోరాటయోధుడు కుమురం భీం అడుగుజాడల్లో యువత నడవాలని ఆదివాసీ సంఘాల ఐక్యవేదిక నాయకులు పిలుపునిచ్చారు. మండలంలోని దమ్మపేట, పట్వారిగూడెంలో కుమురం భీం వర్ధంతిని శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు, వగ్గెలపూజ, కొర్సా వెంకటేశ్, బండారు సూర్యనారాయణ, కుంజా చినబాబు, నాగార్జున, పాయం రమేశ్, వంకా సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

'వసతి గృహాల్లో సౌకర్యాలు కరవు'

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో సౌకర్యాలు రోజురోజుకు దారుణంగా మారుతున్నాయని దీనిపై సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని పీడీఎస్‌యూ డివిజన్ కార్యదర్శి మునిగెల శివప్రశాంత్ అన్నారు. భద్రాచలంలో ఎస్సీ బాలుర వసతి గృహంలో శనివారం పరిశీలించిన వారి బృందం అక్కడ పరిస్థితులు దారుణంగా ఉన్నాయని పేర్కొన్నారు.

కరాటే పోటీల గోడపత్రికల ఆవిష్కరణ

అశ్వాపురం, న్యూస్‌టుడే: అశ్వాపురం సీనియర్ కరాటే మాస్టర్ టి.మురుగన్ ఆధ్వర్యంలో మణుగూరులో డిసెంబర్ 15న జరుగనున్న అంతర్రాష్ట్ర కరాటే పోటీల గోడ పత్రికలను శనివారం కొత్తగూడెంలోని తెలంగాణ భవన్‌లో భారాస జిల్లా సమావేశం సందర్భంగా పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ఆవిష్కరించారు.

పొదెం దృష్టికి మండల సమస్యలు

అశ్వాపురం, న్యూస్‌టుడే: హైదరాబాద్‌లో రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ ఛైర్మన్, భద్రాచలం మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యను కాంగ్రెస్ అశ్వాపురం మండల ప్రధాన కార్యదర్శి చంచల రాము శనివారం కలుసుకున్నారు. మండలానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

గ్రామసభల్లోనే ఎంపిక జరగాలి

ములకలపల్లి, న్యూస్‌టుడే: ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీల ఎంపిక రాజకీయ పార్టీలకు అతీతంగా గ్రామసభల ద్వారానే ఎంపిక చేయాలని సీపీఎం మండల కార్యదర్శి ముదిగొండ రాంబాబు డిమాండ్ చేశారు. ములకలపల్లిలో శనివారం ఏర్పాటు చేసిన కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా నిరుపేదలను ఇందిరమ్మ ఇళ్ల పథకానికి ఎంపిక చేయాలన్నారు. నాయకులు రవికుమార్, మధు, నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గుండాలలో భారీ వర్షం

గుండాల, న్యూస్‌టుడే: గుండాల మండలంలో శనివారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షంలో సేకరణ దశకు వచ్చిన పత్తి, మొక్కజొన్న చేలకు కొంతమేరకు నష్టం వాటిల్లింది. వర్షాధారమైన కొన్ని పంటలకు మేలు జరిగింది.

మొక్కలు నాటిన బాలుడికి సన్మానం

చంద్రుగొండ, న్యూస్‌టుడే: గుర్రాయిగూడెం ప్రాథమిక పాఠశాలలో శనివారం మొక్కలు నాటిన ఐదేళ్ల బాలుడు విశ్వామిత్ర చౌహాన్‌ని పాఠశాల ఉపాధ్యాయులు సన్మానించారు. పాల్వంచలో యూకేజీ చదువుతున్న ఈ బాలుడు తన తండ్రితో కలిసి పలుచోట్ల మొక్కలు నాటుతున్నారు.

22న కోనసీమ జిల్లాలో సీతారామ కల్యాణం

భద్రాచలం, న్యూస్‌టుడే: కోనసీమ జిల్లా కొత్తపేట మండలం పలివెల గ్రామంలో శ్రీభక్తాంజనేయస్వామి వారి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి కల్యాణోత్సవం ఈనెల 22న నిర్వహించనున్నారు. రామ ప్రచార రథం ఒక రోజు ముందుగానే బయలుదేరి అక్కడకు వెళ్లనుంది. ఇందుకు సంబంధించి సిబ్బందికి విధులు అప్పగించారు. ఇదే క్రమంలో రామాలయంలో వైదిక విధులను కేటాయించే బాధ్యతను కీలక ఉద్యోగులకు అప్పగిస్తున్నట్లు సమాచారం. రెండ్రోజుల కిందట ఇక్కడి అనుబంధ కోవెళ్లకు కొద్ది గంటలు తాళాలు వేసి ఉంచిన అంశంపై చర్యలు తీసుకునేందుకు అధికారులు సుదీర్ఘ చర్చలు సాగిస్తున్నారు.

సందడిగా ప్రతిభాపాటవ పోటీలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ఆధ్వర్యంలో శనివారం ప్రతిభాపాటవ పోటీలు నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు.. విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై వ్యాసరచన పోటీలు సాగాయి. బాల, బాలికలు ఎంతో సంతోషంగా వ్యాసాలను రాశారు. కేజీబీవీలో విజేతలుగా నిలిచిన ఎ.మంగలక్ష్మి, బి.జస్మిత, ఆర్.ప్రణతిలకు పాఠశాల స్పెషల్ ఆఫీసర్ పి.లీల ప్రశంసా పత్రాలతో పాటు బహుమతి ప్రదానం చేశారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విజేతలుగా నిలిచిన ఎన్వీ దివ్య, డి.రేవంత్, పి.వరుణ్ కార్తిక్‌లకు పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు జాన్సన్ ప్రశంసా పత్రాలతో పాటు బహుమతి ప్రదానం చేశారు.



భద్రాచలం కేజీబీవీలో విజేతలకు బహుమతులు అందించిన పాఠశాల ప్రత్యేక అధికారి లీల, ఉపాధ్యాయినులు



ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందించిన భద్రాచలం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌ఛార్జి హెచ్‌ఎం జాన్సన్, ఉపాధ్యాయులు

ప్రతిభ చూపి.. బహుమతులు గెలిచి..



విజేతలతో ఎక్స్‌లెంట్ పాఠశాల యాజమాన్యం

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: 'ఈనాడు' ఆధ్వర్యంలో మణుగూరులోని ఎక్స్‌లెంట్ ఉన్నత పాఠశాల, ఎక్స్‌లెంట్ స్టార్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం ప్రతిభాపాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు. . విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎక్స్‌లెంట్ ఉన్నత పాఠశాలలో వరుస బహుమతులు సాధించిన కె.ప్రియహర్షిణి, జి.మేఘవర్షిణి, జె.హన్వీషాకు కరస్పాండెంట్ ఖాదర్, ఎక్స్‌లెంట్ స్టార్ ఉన్నత పాఠశాలలో వై.విమ్రత, ఎస్.కె.తహీరా బేగం, కె.ధనుష్‌రెడ్డికి కరస్పాండెంట్ గబ్బర్ బహుమతులు, ప్రశంసా పత్రాలను అందజేశారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలతో ఎక్స్‌లెంట్ స్టార్ పాఠశాల యాజమాన్యం

ప్రజా సంక్షేమమే ధ్యేయం: జారే

దమ్మపేట, న్యూస్‌టుడే: ప్రజాసంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పాలన సాగుతోందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. గండుగులపల్లి క్యాంప్ కార్యాలయంలో ప్రజాపాలన కార్యక్రమంలో ఆయన శనివారం పాల్గొన్నారు. ఐదు మండలాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. పలు సమస్యలపై ఆయా శాఖల అధికారులతో అక్కడి నుంచే చరవాణిలో మాట్లాడారు.



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

✦ పార్కెలగండికి చెందిన కొండ్రు వెంకటేశ్ రోడ్డు ప్రమాదంలో గాయపడగా హైదరాబాద్ నిమ్స్‌లో వైద్యం కోసం సీఎం సహాయనిధి నుంచి రూ.లక్ష ఎల్‌వోసీ చెక్కును బాధిత కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే జారే శనివారం అందజేశారు.

విద్యార్థులు లక్ష్యసాధనతో ముందుకెళ్లాలి

మణుగూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: నేటితరం విద్యార్థులంతా భవిష్యత్తు లక్ష్యసాధనతో ముందుకెళ్లాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. మణుగూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులకు శనివారం పాయం పాఠ్యపుస్తకాలు అందజేశారు. సీఎం రేవంత్ రెడ్డి విద్యారంగాన్ని బలోపేతం చేస్తున్నారని, నిరుద్యోగుల కోసం పలు నోటిఫికేషన్లను విడుదల చేస్తున్నారని వివరించారు. ఏజెన్సీ ప్రజల అభ్యున్నతికి జిల్లా ఉన్నతాధికారులూ కృషిచేస్తున్నారని ప్రశంసించారు. కళాశాలలో అవసరమైన పనులను త్వరలోనే ప్రారంభిస్తానని హామీ ఇచ్చారు. ఐటీడీఏ పీవో రాహుల్, ఏపీవో డేవిడ్‌రాజు, తహసీల్దారు రాఘవరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు నాగమునినాయక్, డిగ్రీ కళాశాల ప్రధానాచార్యుడు భద్రయ్య, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పాయం, చిత్రంలో ఐటీడీఏ పీఓ రాహుల్

తహసీల్దార్ చొరవతో ఆంధ్రా రోడ్డుకు మరమ్మతులు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఎటపాక మండలం కన్నాయిగూడెం వద్ద ర.భ.శాఖ ప్రధాన రహదారి గోతులమయంగా తయారై తరచూ ప్రమాదాలు జరిగి ప్రయాణికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ఇలాంటి ఘటనలకు చలించిన దుమ్ముగూడెం తహసీల్దార్ ఎం.అశోక్‌కుమార్ ఆ రోడ్డు మరమ్మతులకు చొరవ చూపారు. శనివారం యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించారు. ఏపీలోని కన్నాయిగూడెం గ్రామం దుమ్ముగూడెం మండలానికి కూతవేటు దూరంలో సరిహద్దు గ్రామంగా ఉంది. ప్రతిరోజు ఇరు రాష్ట్రాల ప్రయాణికులు పలు వాహనాల్లో ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తారు. కన్నాయిగూడెం వద్ద రోడ్డు మొత్తం దెబ్బతిని గోతులమయంగా మారింది. తరచూ ప్రమాదాలూ చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో దుమ్ముగూడెం తహసీల్దార్ అశోక్‌కుమార్ శనివారం స్వయంగా కన్నాయిగూడెం రహదారిని పరిశీలించారు. రహదారిపై గోతులను మట్టితో నింపి జేసీబీ వాహనంతో చదును చేయించారు. తహసీల్దార్ అశోక్‌కుమార్ చొరవను స్థానికులు ప్రశంసించారు.



మట్టితో గుంతలు పూడ్చి చదును చేస్తున్న జేసీబీ

యువత క్రీడల్లో రాణించాలి: ఎంపీ రాఘురాంరెడ్డి

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: యువత క్రీడల్లో రాణించాలని ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి పేర్కొన్నారు. అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో పీవీఆర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్యే జారే ఆదినారాయణతో కలిసి శనివారం రాత్రి బహుమతులు అందజేశారు. ఫైనల్ ఆటలో మొదటిస్థానంలో నిలిచిన జమలాపురం టీం సభ్యులకు రూ.50వేల చెక్కుతోపాటు, షీల్డ్ బహూకరించారు. కార్యక్రమంలో పర్సా వెంకటేశ్వరరావు, వేముల రమణ, నరసింహరావు, నరేష్, రాము, లక్ష్మారెడ్డి, శివ పాల్గొన్నారు.




క్రీడాకారులకు మొదటి బహుమతిగా రూ.50వేల చెక్కు అందజేస్తున్న ఎంపీ రాఘురాంరెడ్డి, ఎమ్మెల్యే జారే

గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతి

పినపాక, న్యూస్‌టుడే: గుండెపోటుతో అంగన్‌వాడీ కార్యకర్త మృతిచెందిన ఘటన పోతురెడ్డిపల్లిలో శనివారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గాండ్లబయ్యారానికి చెందిన గడ్డం సత్యవతి(60) పోతురెడ్డిపల్లి అంగన్‌వాడీ కార్యకర్తగా పనిచేస్తున్నారు. శనివారం విధులకు హాజరైన ఆమె గుండెల్లో నొప్పిగా ఉందంటూ కుప్పకూలిపోయింది. మణుగూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె భౌతికకాయానికి సీడీపీవో జయలక్ష్మి, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు నివాళులర్పించారు.

అధికారుల స్పందనతో.. సమస్యలు పరిష్కారం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
భద్రాచలం: 79950 67029
అశ్వారావుపేట: 80085 73696
పినపాక: 91212 29033



అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: పాతమామిళ్లవారిగూడెంలో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లేదారికి ఇరువైపుల పిచ్చిమొక్కలు మొలవటంతో పాటు, వీధుల్లో చెత్తా చెదారం చేరిన అంశంపై ఈ నెల 16న 'మీమున్నాం.. మీకు తోడుగా..!'లో ప్రచురితమవడంతో స్పందించిన పంచాయతీ కార్యదర్శి సబిత శనివారం పిచ్చిమొక్కలను తొలగింపజేయించి, గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించారు.

✦ జమ్మిగూడెంలో మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం చేరటంతో నీరు బయటకు వెళ్లక కాలువల్లో మురుగు నిలువ ఉండి దుర్వాసన వస్తున్న అంశంపై ఈనెల 17న ప్రచురితం కాగా గ్రామ పంచాయతీ కార్యదర్శి కార్తిక్ స్పందించారు. కాలువల్లో చేరిన చెత్తాచెదారాన్ని తొలగింపజేయించి సమస్యను పరిష్కరించారు.

అశ్వారావుపేట: గాండ్లగూడెంలో మురుగునీటి పారుదల ఇబ్బందులపై ఈనెల 16న ప్రచురితం కావడంతో పంచాయతీ కార్యదర్శి లక్ష్మి స్పందించి బోరు నీరు కాలువలోకి వెళ్లేలా ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించారు.

ఆళ్లపల్లి, న్యూస్‌టుడే: ఆళ్లపల్లి పంచాయతీ పరిధిలో చెత్త సేకరణ నిలిచిపోయిన అంశంపై ఈనెల 18న ప్రచురితమవడంతో కార్యదర్శి వి.శిరీష సిబ్బందితో చెత్తసేకరణ నిర్వహించారు.

పినపాక, న్యూస్‌టుడే: మండలకేంద్రంలో మురుగుకాలువలు శుభ్రం చేయకపోవడంతో దోమలు వ్యాప్తి చెందుతున్న పరిస్థితిపై 'మేమున్నాం.....మీకు తోడుగా'లో శనివారం ప్రచురితమవడంతో పంచాయతీ కార్యదర్శి ఉమామహేశ్వరరావు స్పందించి కాలువను శుభ్రం చేయించారు.



కాలువలు శుభ్రం చేస్తున్న పంచాయతీ కార్మికులు

దుమ్ముగూడెం, న్యూస్‌టుడే: లక్ష్మీనగరం గ్రామంలో శ్మశానవాటిక స్థలం సమస్య కారణంగా దహన సంస్కారాల సమయంలో స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్న అంశంలో ఈనెల 7న 'మేమున్నాం.. మీకుతోడుగా'లో ప్రచురితమవడంతో తహసీల్దార్ అశోక్‌కుమార్ స్పందించారు. శ్మశానవాటిక స్థలాన్ని సర్వే చేయించి ఆ స్థలాన్ని గ్రామస్థులకు అప్పగించి సమస్య పరిష్కరించారు. ✦ గౌరవరం-పైదిగూడెం గ్రామాల మధ్య త్రీఫేజ్ విద్యుత్తు లైన్ తెగిపడి ప్రమాదకరంగా మారడంతో ఈనెల 17న ప్రచురించడం కావడంతో ఏఈ మోహన్‌రెడ్డి స్పందించారు. మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించారు.

రసాభాసగా చీరల పంపిణీ

ములకలపల్లి, న్యూస్‌టుడే: ములకలపల్లి మండలంలో మహిళా సంఘాల గ్రామదీపికల(వీఓఏ) ఆధ్వర్యంలో చేపట్టిన బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం రసాభాసగా సాగింది. మండల వ్యాప్తంగా సుమారు 16వేల పైగా మహిళ ఓటర్లు ఉన్నారు. బతుకమ్మ చీరలు కేవలం 7800 మండలానికి చేరుకోగా, మహిళ సంఘాలలో సభ్యులుగా ఉన్నవారికే చీరలు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. దీంతో పూసుగూడెం పంచాయతీ కార్యాలయ ఆవరణలో చేపట్టిన చీరల పంపిణీ కార్యక్రమాన్ని కొందరు మహిళలు అడ్డుకున్నారు. మహిళ సంఘ సభ్యులతో పాటు తమకూ ఇవ్వాలని, లేకుంటే ఎవ్వరికీ ఇవ్వొద్దంటూ ఆందోళనకు దిగారు. దీంతో చేసేదిలేక కార్యక్రమాన్ని నిలిపివేశారు. దీనిపై తహసీల్దార్ పుల్లారావు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ తొలివిడత మహిళా సంఘ సభ్యులకే వచ్చాయని, రెండో విడతలో అందరికీ పంపిణీ జరుగుతుందన్నారు.

రామాలయ ఉద్యోగుల అంతర్గత బదిలీలు

భద్రాచలం, న్యూస్‌టుడే: భద్రాచలం రామాలయ ఉద్యోగులకు శనివారం అంతర్గత బదిలీలు చేశారు. పరిపాలనా సౌలభ్యం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఈఓ రమాదేవి ప్రకటించారు. అన్ని విభాగాలలో 12 మందికి స్థానచలనం కలగగా.. ఇందులో కొంత మందికి అదనపు బాధ్యతలు అప్పగించారు. సిబ్బంది తమ కొత్త విధుల్లోకి వెంటనే చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కొత్తగూడెం

•కొత్తగూడెం • ఇల్లెందు

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: కొత్తగూడెం నార్త్ సెక్షన్ పరిధిలో జనమందిర్ 33/11కేవీ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో విద్యుత్తులైన్ల మరమ్మతులు చేపడుతున్నందున కొత్తగూడెం పట్టణంలోని ఎంజీ రోడ్, పెద్ద బజార్, చిన్న బజార్, నేతాజీ మార్కెట్, మేదర బస్తీ, కూలీ లైన్ ప్రాంతాల్లో ఆదివారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ నర్మద శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఇల్లెందు గ్రామీణం: విద్యుత్తు లైన్ల మరమ్మతుల కారణంగా సత్యనారాయణపురం, ఇల్లందులపాడు, రైటర్‌బస్తీ, బొల్లినగర్, 21పిట్, 24 ఏరియా, సబ్‌జైల్ ఏరియా, రాజీవ్‌నగర్, కొత్తబస్టాండ్, యన్‌జీఓస్ కాలనీ, ఎల్‌బీఎస్‌నగర్, ఎల్లన్నగ్రౌండ్ ఏరియా, బుగ్గవాగుమిల్ ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ రాము తెలిపారు.

నూతన విద్యావిధానం రద్దు కోసం ఉద్యమించాలి: ఏఐఎస్ఎఫ్

జూలూరుపాడు: జాతీయ నూతన విద్యావిధానం రద్దుకు విద్యార్థులు ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ కోరారు. జూలూరుపాడులో శనివారం సంఘం సమావేశంలో మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 10శాతం నిధులు కేటాయించలేదని, స్వల్ప నిధులతో నూతన విద్యావిధానం ఎలా అమలు చేస్తారని ప్రశ్నించారు.

సమస్య: పాల్వంచ గాంధీనగర్‌కాలనీలోని డ్రైనేజీలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, విషపురుగులు సంచరిస్తున్నాయి. **- సంతోష్, స్థానికుడు**

సమాధానం: సంబంధిత ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి**

– పాల్వంచ, న్యూస్‌టుడే

రుద్రంపూర్, గౌతంపూర్, రామవరం ప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉంది. వాటి బెడద నివారణకు ఫాగింగ్ చేయించాలి. **- తేరాల భావన, రామవరం**

✔ సివిల్ విభాగాన్ని ఆదేశించి స్థానికంగా ఫాగింగ్ చేయిస్తాం. **- జీఎం షాలేము రాజు**

– కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే



పాల్వంచ పట్టణం గట్టాయిగూడెం కాలనీలో మురుగుకాలువలో పూడిక తీయకపోవడంతో దుర్వాసన వస్తోంది. పిచ్చిమొక్కలు పెరిగి దోమలు, విషపురుగులు సంచరిస్తున్నాయి. **- కృష్ణ, స్థానికుడు**

✔ ఏరియా జవాన్‌కు చెప్పి సమస్య పరిష్కరిస్తాం. **- కేవీ లక్ష్మణ్‌రావు, పారిశుద్ధ్య అధికారి** పాల్వంచ, న్యూస్‌టుడే

చదువు, క్రీడల్లో రాణించాలి: ఎమ్మెల్యే



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించి అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు హాజరయ్యే క్రీడాకారుల కోసం జిల్లా స్థాయి ఎంపికలను రెండో రోజు శనివారం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తే క్రీడా కోటా కింద పై చదువులకు సీట్లు, ఉద్యోగాలు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు గాయాలు కాకుండా క్రీడలు ముగించినందుకు నిర్వాహకులను ఎమ్మెల్యే అభినందించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సమీకృత గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేయడం హర్షనీయమన్నారు. ఐటీడీఏ పీవో రాహుల్ మాట్లాడుతూ మానసిక ఒత్తిడిని తగ్గించాలంటే ఆటలు ముఖ్యమన్నారు. డీడీ మణెమ్మ మాట్లాడుతూ భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని ఏడు జోన్ల నుంచి 8 క్రీడాంశాల్లో 800 మంది విద్యార్థులు ఎంపికలకు హాజరయ్యారని, 240 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. క్రీడల అధికారి గోపాలరావు, ఏసీఎంవో రమణయ్య, ఏటీడీవోలు జహీరుద్దీన్, అశోక్‌కుమార్, అనురాధ, చంద్రమోహన్, అదనపు క్రీడల అధికారులు, వెంకటనారాయణ, ప్రధానోపాధ్యాయులు రామారావు పాల్గొన్నారు.

ఈ అవస్థలు.. ఇంకెన్నాళ్లు..?

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే

కాలం చెల్లిన ఆర్టీసీ బస్సులను నడుపుతుండటంతో ఎప్పుడు ఎక్కడ ఆగిపోతాయేమోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఇల్లెందుకు నియోజకవర్గ ప్రజలతో పాటు గుండాల, ఆళ్లపల్లి మండలాల ఏజెన్సీవాసులు రాకపోకలు సాగిస్తుంటారు. మారుమూల మండలమైన గుండాలకు రాకపోకలు సమయంలో బస్సుల మొరాయింపుతో అవస్థలు తప్పటం లేదు. ఇల్లెందు నుంచి ఖమ్మం, కొత్తగూడెం మార్గాల్లోనూ తరచూ బస్సులు నిలిచిపోతున్నాయి.



నామమాత్రపు సర్వీసులకే..

ఇల్లెందు శాటిలైట్ బస్సు డిపో నామమాత్రపు సర్వీసులకే పరిమితమవుతోంది. ఖమ్మం, కొత్తగూడెం డిపోల పరిధిలోనే డీజిల్ నింపుకోవాల్సి వస్తోంది. ఇటీవల రాత్రిపూట ఇంజిన్ ఫ్యాన్ బెల్టు ఊడిపోయి కొత్తగూడెం వెళ్లాల్సిన బస్సు ఇల్లెందు పట్టణంలో నిలిచిపోయింది. ప్రయాణికులు మరో బస్సు కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది.

★ ఇల్లెందు నుంచి కేవలం 20 సర్వీసులు ఉన్నాయి. వీటిలో హైదరాబాద్‌కు ఐదు హైటెక్ బస్సులు, ఒక డీలక్స్ బస్సు నడుస్తున్నాయి. ఇల్లెందు నుంచి ఖమ్మం నగరానికి నాలుగు ఎక్స్‌ప్రెస్, మూడు ఆర్డినరీ సర్వీసులు కొనసాగుతున్నాయి. కొత్తగూడెం, గుండాలకు మూడు చొప్పున ఆర్డినరీ బస్సు సర్వీసులు ఉండగా మర్కోడు గ్రామానికి ఒక ఆర్డీనరీ బస్సు నడుస్తోంది. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా బస్సు సర్వీసులు లేవు. పైగా బస్సులు బ్రేక్ డౌన్ అవుతున్న సందర్భాల్లో ప్రయాణికులకు మరిన్ని తిప్పలు తప్పటం లేదు.

ఇల్లెందు బస్‌డిపోకు మరిన్ని సర్వీసులు త్వరలో రానున్నాయి. వీటితో పాటు పూర్తిస్థాయిలో డిపో మేనేజర్ అందుబాటులో ఉండనున్నారు. డిపోలోనూ సౌకర్యాల కోసం అదనపు నిర్మాణాలు చేపట్టేలా ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. **- సంజీవరాణి, ఇన్‌ఛార్జి మేనేజర్, ఇల్లెందు డిపో**

మండల విద్యా వనరుల కేంద్రం పరిశీలన

ఈనాడు కథనానికి స్పందన



విద్యానగర్ పంచాయతీలో శిథిలావస్థకు చేరి నిరుపయోగంగా మారిన మండల విద్యాశాఖ వనరుల కేంద్రాన్ని జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్ సతీశ్, సీఎంవో సైదులు, చుంచుపల్లి ఎంఈవో బాలాజీ శనివారం పరిశీలించారు. శుక్రవారం 'అసాంఘిక శక్తులకు వనరు' అనే శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన వారు భవనాన్ని పరిశీలించి వినియోగంలోకి తెచ్చేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలపై చర్చించారు. చుట్టూ ఫెన్సింగ్ లేదా ప్రహరీ, భవన మరమ్మతుల గురించి ఇంజినీరింగ్ శాఖ అధికారులతో మాట్లాడారు. త్వరలో దాన్ని వినియోగంలోకి తెచ్చేలా చర్యలు చేపడతామని తెలిపారు. – చుంచుపల్లి, న్యూస్‌టుడే

సృజనకు పదును



కేటీపీఎస్ డీఏవీలో విజేతలతో ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు



బొల్లోరిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో విజేతలతో హెచ్ఎం మంగమ్మ

'ఈనాడు' ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణం కేటీపీఎస్ డీఏవీ స్కూల్, బొల్లోరిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రతిభాపాటవ పోటీలను శనివారం నిర్వహించారు. 'అంతర్జాలం వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సామాజిక మాధ్యమం ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు జరిగాయి. కేటీపీఎస్ డీఏవీ పాఠశాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ప్రజ్ఞశ్రీ, లేఖిని, యశస్వికి ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు నాగేశ్వరరావు బహుమతులు అందజేశారు.

* బొల్లోరిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొలి మూడు స్థానాల్లో నిలిచిన దినేష్‌కుమార్, అన్వర్‌పాషా, హర్షవర్ధన్‌కు హెచ్ఎం మంగమ్మ బహుమతులు ప్రదానం చేశారు.

- పాల్వంచ, న్యూస్‌టుడే

పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి

గడ్డపోతారం(జిన్నారం), న్యూస్‌టుడే: పరిశ్రమ సంపులో పడి ఎలక్ట్రికల్ ఇంజినీర్ మృతి చెందిన ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గడ్డపోతారం పారిశ్రామిక వాడలో శనివారం చోటుచేసుకుంది. ఐడీఏ బొల్లారం పోలీసులు, పరిశ్రమ వర్గాల తెలిపిన వివరాల ప్రకారం.. సెల్‌మార్ ల్యాబరేటరీ పరిశ్రమలో పదిలం రాజేశ్(31) ఎలక్ట్రికల్ ఇంజినీర్‌గా పని చేస్తున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు మొదటి షిఫ్టులో విధులకు వచ్చిన ఆయన చిల్లింగ్ ప్లాంటు బ్రెయిన్ సంపులో పడి మృతి చెందారు. కొత్తగూడేనికి చెందిన రాజేశ్ గత కొంతకాలంగా మేడ్చల్ జిల్లా సూరారంలో ఉంటున్నారు. ఆయనకు భార్య, కుమార్తె ఉన్నారు. ఘటనా స్థలాన్ని ఐడీఏ బొల్లారం సీఐ గంగాధర్ పరిశీలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

సుజాతనగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ గుగులోతు శంకర్(60) చికిత్స పొందుతూ ఖమ్మంలోని ఓ ఆసుపత్రిలో శనివారం మృతి చెందారు. మంగపేట వద్ద రెండు కార్లు, ద్విచక్రవాహనం గురువారం ఢీకొన్న ఘటన తెలిసిందే. తలకు బలమైన గాయం కావడంతో ఖమ్మం ఆసుపత్రికి అదే రోజు తరలించగా.. చికిత్స పొందుతూ మరణించినట్లు తెలిపారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఎస్సై జుబేదా బేగం కేసు నమోదు చేశారు. భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తెలున్నారు.

పిడుగుపాటుకు ఎద్దు..

టేకులపల్లి, న్యూస్‌టుడే: తావుర్యాతండా పంచాయతీ స్టేషన్ తడికలపూడిలో శనివారం పిడుగుపాటుకు రైతు ధరంసోత్ సిరి దుక్కిటెద్దు మృతి చెందింది. రైతు సిరి చేనులో పత్తి తీయిస్తుండగా ఎడ్లబండి కాని వద్ద తన జత ఎడ్లను కట్టేసి మేత వేశారు. ఉరుములతో కూడిన వర్షం కురవడంతో సమీపంలో పిడుగు పడటంతో ఒక ఎద్దు మృతి చెందింది.

అక్రమంగా తరలిస్తున్న బెల్లం పట్టివేత

ఇల్లెందు గ్రామీణం: పోచారానికి చెందిన గుగులోత్ నాన్కు శనివారం ద్విచక్రవాహనంపై గ్రామానికి అక్రమంగా 16కిలోల బెల్లం తీసుకెళ్తున్నారు. మొండితోగు వద్ద తనిఖీలు చేస్తుండగా బెల్లాన్ని స్వాధీనం చేసుకుని హెడ్‌కానిస్టేబుల్ లక్ష్మారెడ్డి విచారణ చేస్తున్నారు.

పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదైంది. ఎస్సై సురేశ్ కథనం మేరకు.. శనివారం రాజాపురం వద్ద వాహన తనిఖీలు చేస్తుండగా ఆటోలో 11 బస్తాలు(550 కిలోలు) పీడీఎస్ బియ్యం తరలిస్తున్న ఆటోను పట్టుకున్నారు. వీటి విలువ రూ.13,750 ఉంటుందని, బియ్యం తరలిస్తున్న అప్పుల శ్రీనివాసరావు, బానోత్ నరేశ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఠాణాలో గంజాయి కేసు నమోదు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణ ఠాణాలో గంజాయి కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై సుమన్ కథనం మేరకు.. శనివారం పాల్వంచ బస్టాండ్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా విశాఖ జిల్లా, పెద్దగంట్యాడ, కాపు తుంగల గ్రామానికి చెందిన బంకర ధనుశ్ బస్సులో సీలేరు నుంచి భద్రాచలం వచ్చి, అక్కడి నుంచి ఆటోలో పాల్వంచ బస్టాండుకు వచ్చారు. విజయవాడ వెళ్లేందుకు బస్సు కోసం ఎదురు చూస్తుండగా అనుమానాస్పదంగా కనిపించడంతో పోలీసులు పట్టుకుని తనిఖీ చేశారు. కిలో గంజాయి ఉండటంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి: డీఎస్పీ



సీఐ ఇంద్రసేనారెడ్డితో మాట్లాడుతున్న డీఎస్పీ అబ్దుల్ రెహమాన్

జూలూరుపాడు, న్యూస్‌టుడే: జూలూరుపాడులోని పోలీసు సర్కిల్ కార్యాలయాన్ని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ శనివారం తనిఖీ చేశారు. వార్షిక తనిఖీల్లో భాగంగా సర్కిల్ పరిధిలోని పోలీస్ స్టేషన్లలో నమోదైన కేసుల వివరాలు, కార్యాలయ రికార్డులను పరిశీలించారు. సీఐ ఇంద్రసేనారెడ్డితో పెండింగ్ కేసుల విషయమై మాట్లాడారు. సిబ్బంది సమస్యలనడిగి తెలుసుకున్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దని, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తేవాలని డీఎస్పీ సూచించారు.

24న ఆయుర్వేద వైద్య శిబిరం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఈ నెల 24న జేకే సీఈఆర్ క్లబ్ నందు ఇల్లెందు ఏరియా సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యుల కోసం ఆయుర్వేద శిబిరం నిర్వహిస్తున్నట్లు శనివారం జీఎం జాన్ ఆనంద్ తెలిపారు. డా.విశ్వనాథ మహర్షి ఆధ్వర్యంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి స్థల పరిశీలన

టేకులపల్లి: కోదండ రామాలయంలో శనివారం జరిగే వారాంతపు సంతలో ప్రజా మరుగుదొడ్లు, దుకాణ సముదాయాల నిర్మాణానికి శనివారం సంత ప్రాంగణంలో స్థల పరిశీలన చేపట్టారు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని దుకాణదారులు, ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల నేపథ్యంలో స్థల పరిశీలన చేస్తున్నట్లు ఎంపీడీఓ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి ఉప్పు దీప్తి, మంగీలాల్‌నాయక్ పాల్గొన్నారు.

కార్మిక ఉద్యమాలను బలోపేతం చేస్తాం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: ఇఫ్టూని టీయూసీఐలో విలీనం చేసి బలమైన కార్మిక ఉద్యమాలు చేపడతామని ఇఫ్టూ జిల్లా కార్యదర్శి షేక్ యాకుబ్‌షావలి తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లో టీయూసీఐలో ఇఫ్టూ విలీన కార్యక్రమంలో కార్మికులు పాల్గొనాలని కోరుతూ శనివారం హమాలీ, పుర కార్మికులతో నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సంపత్, సీతారాములు, రవి, శ్యాం, వెంకటయ్య, వెంకన్న, ఐలయ్య, శ్రీను పాల్గొన్నారు.

కొత్తగూడెం సింగరేణి: టీయూసీఐలో ఇఫ్టూ విలీనమవుతున్న నేపథ్యంలో ఇఫ్టూ శనివారం పట్టణంలో ప్రచార ప్రదర్శన నిర్వహించింది. పెద్దబోయిన సతీష్, బానోతు ధర్మా, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హైకోర్టు తీర్పును అమలు చేయాలని డిమాండ్

టేకులపల్లి, న్యూస్‌టుడే: కేటీసీ-2 భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించాలని తెలంగాణ వ్యకాస జిల్లా ప్రధాన కార్యదర్శి రేపాకుల శ్రీనివాస్ సింగరేణి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. తెవ్యకాస, భూనిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో శనివారం కేటీసీలో నిర్వాసితులు ఆందోళన నిర్వహించి పీఓకు వినతిపత్రం అందజేశారు. హైకోర్టు తీర్పు ప్రకారం సమస్యను పరిష్కరించాలని కోరారు. నరసింహారావు, వీరన్న, స్వామి, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, చుక్కమ్మ పాల్గొన్నారు.

భారాస కార్యాలయం ఎదుట నిరసన

కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: లోక్‌సభ ఎన్నికల సందర్భంగా ప్రచారం కోసం తమ వాహనాలను వాడుకుని బకాయిపడిన మొత్తాన్ని చెల్లించాలని కోరుతూ ఆటో ట్రాలీ యజమానులు శనివారం భారాస కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. పార్టీ కార్యాలయంలో సమావేశం ముగిసిన అనంతరం ప్రముఖులు వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని అడ్డుకున్నారు. మాజీ శాసనసభ్యుడు తాటి వెంకటేశ్వర్లుకు, సంఘం యజమానులకు వాగ్వాదం కొనసాగింది. పార్టీ అధ్యక్షుడు రేగా కాంతారావు వారితో చర్చించి హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

'దాడికి పాల్పడ్డ వారిపై చర్యలు తీసుకోండి'

కొత్తగూడెం నేరవిభాగం: ఇల్లెందులో విలేకరిపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కొత్తగూడెం పాత్రికేయ, ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల బృందాలు ఎస్పీ బి.రోహిత్‌రాజుకు శనివారం ఫిర్యాదు చేశాయి. నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు.

పంటల తెగుళ్ల నివారణపై అవగాహన

సుజాతనగర్, న్యూస్‌టుడే: పంటల తెగుళ్ల నివారణపై అవగాహన కార్యక్రమం రైతు వేదికలో శనివారం నిర్వహించారు. వ్యవసాయ శాఖ అధికారి నర్మద మాట్లాడుతూ.. పత్తి, వరి పంటల సాగుపై అవగాహన కల్పించారు. సస్యరక్షణ చర్యలు, వాటిని పాటించే పద్ధతులను వివరించారు. ఎంపీడీఓ భారతి, సిబ్బంది శివ, శరత్, ప్రసూన పాల్గొన్నారు.

గీతకార్మికుల రక్షణకే కాటమయ్య కిట్లు



కార్మికులకు కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీలు రఘురాంరెడ్డి, బలరాం నాయక్, కలెక్టర్ జితేశ్ వి.పాటిల్, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, వెంకట్రావ్

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: గీత కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, వారి రక్షణ కోసం 'కాటమయ్య' రక్షణ కవచాలను ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ తెలిపారు. వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శనివారం ఇల్లందు అతిథి గృహంలో కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్ల పంపిణీ ఏర్పాటు చేశారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ మాట్లాడుతూ.. ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో మొదటి విడతగా 83 మంది కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కవచాలను అందిస్తున్నామని వివరించారు. ఐటీడీఏ పీఓ రాహుల్, ఎమ్మెల్యేలు జారే ఆదినారాయణ, తెల్లం వెంకట్రావ్, జిల్లా అటవీశాఖాధికారి కిష్టాగౌడ్, ఎక్సైజ్ శాఖ సూపరింటెండెంట్ జానయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి ఇ.ఇందిర, తెలంగాణ గౌడ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి రాజు గౌడ్, రాజయ్య గౌడ్ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి, న్యూస్‌టుడే: లోతువాగులోని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు తూము చౌదరి ఇంటిని శనివారం ఎంపీలు బలరాం నాయక్, రఘురాంరెడ్డి, ఎమ్మెల్యేలు ఆదినారాయణ, వెంకట్రావ్, రాందాసునాయక్ సందర్శించారు. కొత్తగూడెంలో నిర్వహించిన దిశ సమావేశానికి హాజరైన వారిని తూము చౌదరి తన ఇంటికి మర్యాద పూర్వకంగా ఆహ్వానించారు. అక్కడే మధ్యాహ్న భోజనాలు చేసిన వారిని ఆయన శాలువాలతో సన్మానించారు.

దాడులు చేసే వారిని శిక్షించాలి

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: హిందూ దేవాలయాలపై దాడులు చేసే వారిని కఠినంగా శిక్షించాలని వీహెచ్‌పీ, భజరంగదళ్ ఆధ్వర్యంలో శనివారం కార్యకర్తలు కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ ఓరుగంటి సురేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా మతోన్మాద శక్తులు కొన్ని హిందూ దేవాలయాలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం కలెక్టరేట్ ఏఓ ఎం.రమాదేవిని కలిసి వినతిపత్రం అందించారు. చిలుకూరి నాగేశ్వరరావు, రమేశ్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

మానవ క్రయవిక్రయాలు అరికట్టాలి



కొత్తగూడెం విద్యావిభాగం: జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న న్యాయమూర్తి భానుమతి

కొత్తగూడెం విద్యావిభాగం, న్యూస్‌టుడే: మానవ క్రమవిక్రయాలు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్నాయని, దానిని అరికట్టాలని టెలికం రెగ్యులేటింగ్ అథారిటీ ఆఫ్ ఇండియా(టి.ఆర్.ఎ.ఐ) అధికార ప్రతినిధి ప్రభాకర్‌రావు తెలిపారు. కొత్తగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రామ జ్యోతి సొసైటీ మదనపల్లి వారి సౌజన్యంతో కళాశాలలో మానవ అక్రమ రవాణా, బానిసత్వంపై అవగాహన కార్యక్రమం శనివారం నిర్వహించారు. తొలుత కార్యక్రమాన్ని జిల్లా న్యాయమూర్తి భానుమతి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు లక్కినేని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పట్టణంలో ప్రదర్శన నిర్వహించి న్యాయమూర్తి మాట్లాడారు. కళాశాల ప్రిన్సిపల్ కత్తి రమేశ్, ఎన్‌సీసీ అధికారి బండి వెంకటేశ్వరరావు, షీటీం ఎస్సై రమాదేవి పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం: ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు బాల్యం నుంచే న్యాయచట్టాలపై అవగాహన కలిగి ఉండాలని ఇల్లెందు న్యాయస్థానం న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి తెలిపారు. ఇల్లెందు మెయిన్‌రోడ్ ఉన్నత పాఠశాలలో శనివారం బాలిక సాధికారత అంశంపై నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, బాలకార్మిక నిషేధ చట్టాలపై విద్యార్థులకు వివరించారు. ఉపాధ్యాయుడు లాలు, న్యాయవాది ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

వేడుక భవనం లీజు హక్కు రద్దు

పాల్వంచ పట్టణం, న్యూస్‌టుడే: పెద్దమ్మ తల్లి దేవాలయం ఆధీనంలోని 700 మంది సామర్థ్యం గల ఏసీ వేడుక భవనం లీజుదారుడు రెండో వాయిదా నగదు రూ.2.2 లక్షలు చెల్లించకపోవటంతో అతని లీజు రద్దు చేసినట్లు ఈవో రజనీకుమారి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేడుక భవనం బుకింగ్ కోసం ఆలయ అధికారులను సంప్రదించాలని ఆమె కోరారు.

బంగారు పతకం సాధించిన వంశీకి అభినందన

కొత్తగూడెం కలెక్టరేట్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించిన భద్రాచలానికి చెందిన ఎం.వంశీని కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ శనివారం ఆయన ఛాంబర్‌లో అభినందించారు. ఆయన మాట్లాడుతూ.. ఇటీవల జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో వంశీ పాల్గొని బంగారు పతకం సాధించి జిల్లాకు మంచి పేరు తీసుకురావడం అభినందనీయమన్నారు.

21నుంచి కొత్తగూడెంలో ఐద్వా మహాసభలు



కొత్తగూడెం సింగరేణి: మాట్లాడుతున్న బుగ్గవీటి సరళ తదితరులు

బాగ్‌లింగంపల్లి, న్యూస్‌టుడే: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభలను సోమవారం నుంచి బుధవారం వరకు కొత్తగూడెంలో నిర్వహించనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి తెలిపారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని ఐలమ్మ ట్రస్ట్ భవన్‌లో శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. అతివలు అన్నిరంగాల్లో సాధికారత సాధించేలా.. 33 శాతం రిజర్వేషన్లను సకాలంలో అమలు చేయాలని పాలకులకు విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలో జరిగే మహాసభలకు సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు బృందాకారాట్, ఐద్వా జాతీయ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పీకే శ్రీమతి, మరియం ధావలే, జాతీయ కోశాధికారి పుణ్యవతి, ఉపాధ్యక్షురాలు సుందర్ రామన్ హాజరవుతారని పేర్కొన్నారు. ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు కేఎన్ ఆశాలత, రాష్ట్ర కమిటీ సభ్యురాలు కవిత పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి: కొత్తగూడెం సింగరేణి, న్యూస్‌టుడే: అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) రాష్ట్ర నాలుగో మహాసభ 21 నుంచి 23 వరకు కొత్తగూడెంలో నిర్వహిస్తున్నామని, జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బుగ్గవీటి సరళ కోరారు. యూటీఎఫ్ కార్యాలయంలో శనివారం విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. సభకు ముందుగా పాతబస్‌డిపో నుంచి సభా ప్రాంగణానికి ప్రదర్శన నిర్వహిస్తున్నామన్నారు. ఎం.జ్యోతి, ఇందిర, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌కు వెళ్లలేనని లేఖ రాసి విద్యార్థి అదృశ్యం

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలానికి చెందిన ఓ విద్యార్థి బూర్గంపాడు మండలం లక్ష్మీపురంలోని ప్రభుత్వ కళాశాలలోని హాస్టల్‌లో ఉంటూ ఇంటర్ చదువుతున్నాడు. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన విద్యార్థి శనివారం కళాశాలకు వెళ్లాల్సి ఉండగా ఉదయం ఇంట్లో ఓ లేఖ ఉంచి వెళ్లిపోయాడు. లేఖలో తనకు హాస్టల్‌లో ఉండటం ఇష్టం లేదని అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నానని రాసి ఉండగా అతని కోసం వెతికినా ఆచూకీ లభించలేదు. అతడి తండ్రి ఫిర్యాదు మేరకు ఏఎస్సై నాగేశ్వరరావు శనివారం విచారణ చేస్తున్నట్లు తెలిపారు.

కేఓసీలో మూతబడిన క్యాంటీన్

టేకులపల్లి, న్యూస్‌టుడే: కోయగూడెం ఓసీలో కార్మికుల కోసం టెండర్ ప్రాతిపదికన నిర్వహణలో ఉన్న క్యాంటీన్ 15 రోజులుగా మూతపడింది. టెండర్ పొందిన గుత్తేదారు నుంచి సబ్ పొందిన వారు క్యాంటీన్‌ను నిర్వహిస్తున్నారు. నెలవారీగా వచ్చే బిల్లును అసలు గుత్తేదారు సబ్ నిర్వహిస్తున్న వారికి సక్రమంగా చెల్లించకపోవడంతో వారు క్యాంటీన్ నిర్వహించలేక చేతులెత్తేసినట్లు తెలిసింది. క్యాంటీన్ మూతపడటంతో విధులకు హాజరయ్యే కార్మికులు బయట నుంచి అల్పాహారం పార్సిళ్లను తెచ్చుకుంటున్నారు. ఏరియా పర్సనల్ అధికారి మోహన్‌రావును వివరణ కోరగా.. క్యాంటీన్ మూతపడటంతో గుత్తేదారుకు పలుమార్లు నోటీసులు ఇచ్చినా ఎలాంటి స్పందన లేదు. వచ్చే నవంబరుతో టెండర్ ముగియనుంది. కంపెనీ ఆధ్వర్యంలో తాత్కాలికంగా క్యాంటీన్‌ను తెరిచేందుకు ఆలోచనలు చేస్తున్నట్లు తెలిపారు.



విద్యార్థులకు బూట్లు, బెల్టుల పంపిణీ



బూట్లు, టై, బెల్టులు అందజేసిన విద్యానగర్ కాలనీ సీనియర్ సిటిజన్స్

చుంచుపల్లి, న్యూస్‌టుడే: విద్యానగర్‌కాలనీ తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గరిమెళ్లపాడు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం బూట్లు, టై, బెల్టులు పంపిణీ చేశారు. అధ్యక్ష కార్యదర్శులు కొల్లు నాగేశ్వరరావు, సురేశ్ కుమార్ మాట్లాడారు. ప్రధానోపాధ్యాయుడు సీతారాములు, ఉపాధ్యాయురాలు అరుణ, సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ఇల్లెందు గ్రామీణం, న్యూస్‌టుడే: జగదాంబ గుంపు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శనివారం సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు అజయ్, మేఘన దంపతులు రూ.22వేల విలువైన బ్యాగులు, బూట్లు, రాతపుస్తకాలు, పెన్నులు అందజేశారు. చంద్రమౌళి, వసంత, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

కొత్తగూడెం విద్యావిభాగం: పాత కొత్తగూడెం ఆనందఖనిలో అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాల(యూఆర్ఎస్) విద్యార్థులకు కావాల్సిన పలు రకాల సామగ్రి ఎంఈఓ ప్రభుదయాళ్ అందజేశారు. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ ప్రత్యేక నిధులతో విద్యార్థులకు అవసరమయ్యే రాతపుస్తకాలు, ప్లేట్లు, గ్లాసులు, దిండు కవర్లు, మూడు దుప్పట్లు, కార్పెట్ అందజేసిన సామగ్రిని ఎంఈఓ పంపిణీ చేశారు. పాఠశాల ప్రత్యేకాధికారి రాంబాయి పాల్గొన్నారు.